కడప క్రైం, ఆగస్టు 27, ప్రభాతవార్త: మాజీ మంత్రి వైఎస్‌వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఈ కేసులో ముద్దాయిగా ఉన్న ప్రధాన అనుచరుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డా.చైతన్యరెడ్డిల నుంచి తనకు, తన కుటుంబీకులకు ప్రాణహాని ఉందని వారి నుంచి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును వివేకా కేసులో అప్రూవర్‌గా ఉన్న షేక్ దస్తగిరి విన్నవించాడు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన దస్తగిరి అనంతరం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడాడు. వివేకా హత్య కేసులో తాను ఏ4 నిందితునిగా ఉండి అప్రూవర్‌గా మారానని అప్పటి నుంచి సీబీఐ వారు కోర్టు ఆదేశాల మేరకు తనకు గన్‌మెన్ సౌకర్యం కల్పించిందన్నారు. తాను జైలు నుంచి వచ్చిన తరువాత తమ సమీప బంధువుల అమ్మాయి ఎర్రగుంట్లలో ఎస్సీ కులానికి చెందిన అబ్బాయితో వెళ్లిపోయిందని ఆ విషయమై ఆ అమ్మాయి తల్లి నాతో చెప్పడంతో ఆమెతో కలిసి ఎర్రగుంట్ల పీఎస్‌కు వెళ్లి అక్కడ పోలీసులతో మాట్లాడిన సందర్భంలో అప్పట్లో ఉన్న ఎస్సైతో పాటు సీఐ ఈశ్వరయ్య తనను కొట్టడంతో పాటు మానసికంగా వేధించి దుర్భాషలాడాడన్నారు. తనపై కిడ్నాప్ కేసు పెట్టి జైలుకు పంపుతామని బెదిరించారని అంతేకాకుండా అమ్మాయి పంచాయతీకి వెళ్లిన తనను వివేకా కేసు విషయమై ఎస్పీ రాంసింగ్‌పై కేసు పెట్టాలని సీఐ ఈశ్వరయ్య తనను బెదిరించాడన్నారు. తనకు పై స్థాయి నుంచి ఒత్తిడి ఉందని వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల ప్రమేయం ఉందని సీబీఐ ఎస్పీ రాంసింగ్ తనపై ఆవిధంగా చెప్పించి వారిని ముద్దాయిలుగా చేర్చారని ఎస్పీ రాంసింగ్‌పై వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని అంతేకాకుండా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు తెలపాలని తనపై ఒత్తిడి తెచ్చారన్నారు. అందుకు నిరాకరించడంతో తనపై కిడ్నాప్ కేసు మోపడం జరిగిందన్నారు. దేవిరెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి మెడికల్ క్యాంప్ ఉంచి ఆ నెపంతో జైలులో తను ఉన్న బ్లాక్‌లో కలిసి నీవు తమ రాజకీయ జీవితం నాశనం చేశావని వివేకా కేసులో అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల పేర్లు చెప్పి నిందితులుగా చేశావని సీబీఐ రాంసింగ్ చెప్పడంలో అలా చేశానని చెప్పి కోర్టులో సాక్ష్యం చెబితే రూ.20కోట్లు ఇవ్వడం చేస్తామని అలాగే తమ కుటుంబంలో ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తామని లేనిపక్షంలో మిమ్మల్ని అంతం చేస్తామన్నాడన్నారు. ఆ సమయంలో ఆయనతో గొడవ జరిగిందని జైలు అధికారులు చైతన్యరెడ్డిని పంపారన్నారు. జైలు సూపరింటెండెంట్ జోక్యం చేసుకొని పై అధికారుల నుంచి ఒత్తిడి ఉందని వారిపై ఆరోపణలు మానుకోవాలని వారు బెదిరించారన్నారు. అంతేకాకుండా నాపై పలుచోట్ల కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారి నుంచి తమకు ప్రాణ హాని ఉందని ఈ కేసులో అప్రూవర్‌గా మారినందుకు తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నారని దస్తగిరి ఆరోపించాడు. నన్ను బెదిరించి నా కుటుంబీకులను, నన్ను చంపుతానని హెచ్చరిస్తున్న చైతన్యరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు, వైకాపా నాయకులపై నా అభ్యర్థనను పరిశీలించి తమకు ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించినట్లు తెలిపాడు.

అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి

కలుషితాహారంతో 60 మంది విద్యార్థులకు అస్వస్థత

ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో దుర్ఘటన

విద్యార్థులు సురక్షితం: కలెక్టర్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఆగస్టు27, ప్రభాతవార్త: కాకినాడ జిల్లా ఏలేశ్వరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 60 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి విద్యార్థులకు శనగ పప్పు, క్యాబేజీ కూర పెట్టి_నట్లు ప్రిన్సిపాల్ కే.చంద్ర శారద తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానిక ఏఎంఎంకు విషయం తెలుపగా ఉదయం 9గంటలకు మరొక 20మంది విద్యార్థులు, 11 గంటల కు మరో 20మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 12గంటలకు మరో 16 మంది విద్యార్థులు నిరసించడంతో వీరందరిని అంబులెన్స్‌లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏలేశ్వరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి కుదుటపడి, సురక్షితంగా ఉన్నారని జిల్లాకలెక్టర్ షణ్మోహన్ సగిలి >>2

మంగళవారం గుంతకల్లులో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఎం ఎం.విజయకుమార్

రైల్వే సిబ్బందికి పెన్షన్‌గా సగం జీతం

కేంద్ర ప్రభుత్వ సిబ్బందికి ఊరట

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో 63 వేల మంది

సీమ రైల్వే డివిజన్‌లో 11,700 మందికి లబ్ధి

డిఆర్ఎం విజయ్‌కుమార్ వెల్లడి

గుంతకల్లు రైల్వే, ఆగస్టు 27 ప్రభాతవార్త: భారతీయ రైల్వే సహా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖలో పని చేస్తున్న 23 లక్షల మంది సిబ్బందికి వారు పొందే వేతనంలో యాభై శాతం పెన్షన్‌గా పొందే కేంద్ర ప్రభుత్వ ఏకీకృత పెన్షన్ స్కీమ్ అమలు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ ఎం.విజయ కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన తన సంబంధిత ఉన్నతాధికారులైన సీనియర్ డిపిఓ జయశంకం చౌహాన్, సీనియర్ డిఎఫ్ఎం పగ్గాల వి. రామిరెడ్డి, డిపిఓ కార్పిల్ అరోగాలతో కలిసి మాట్లాడుతూ ఈ నెల 24న, కొత్త పెన్షన్ స్కీమ్‌పై కేంద్రప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వ కార్మిక సంఘాల ఉమ్మడి సంప్రదింపుల యంత్రాంగం మధ్యసుహృద్భావ వాతావరణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చలు సఫలమై, ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. ఎన్‌పిఎస్ పథకాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్దరించాలని దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఉన్న డిమాండ్ నేపథ్యంలో సిబ్బంది పెన్షన్ సంస్కరణల కోసం కేంద్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ టివి సోమనాథ్ అధ్యక్షతన ప్రధాని నరేంద్రమోదీ కమిటీ ఏర్పాటు చేశారని, ఈకమిటీ వందకుపైగా ప్రభుత్వఉద్యోగుల సంస్థలతో సంప్రదింపులు, >>2

తీరు మారకపోతే కఠిన చర్యలు

భోజన నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి సవిత

లేపాక్షి ఎంజెపి హాస్టల్ సిబ్బందిపై మంత్రి సవిత ఫైర్

హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

బాత్‌రూములు అపరిశుభ్రతపై మంత్రి మండిపాటు

బియ్యంలో పురుగులు ఉండడంపై మంత్రి ఆగ్రహం

ఏ సమస్య ఉన్నా స్వయంగా తనకు ఫోన్ చేయాలని మంత్రి సవిత సూచన

లేపాక్షి, ఆగస్టు 27 ప్రభాతవార్త:మీ ఇళ్లల్లో పిల్లలను అపరిశుభ్రమైన వాతావరణంలో పెంచుతారా, పురుగులు అన్నం పెడతారా మీ తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని లేపాక్షి ఎంజెపి బిసిసంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బందిని, వార్డెన్‌ను రాష్ట్ర బిసిసంక్షేమశాఖ, చేనేత జౌళిశాఖామంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం లేపాక్షి ఎంజెపి బిసి సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను మంత్రి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ కలియతిరిగి అన్ని గదులు, బాత్‌రూములను పరిశీలించారు. బాత్‌రూములకు డోర్లు, విద్యుత్ సదుపాయం లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాత్ రూముల చుట్టు అపరిశుభ్రత వాతావరణం వుండడంపై పారిశుద్ధ్య సిబ్బందిపై మండిపడ్డారు. హాస్టల్ చుట్టు నీరు నిల్వ వుండడంతో పొరపాటున విద్యార్థులు జారి పడితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను మంత్రి ప్రశ్నించారు. అపరిశుభ్రతతో పాటు నీరు నిల్వ వుండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. తాగునీటి ట్యాంకులు కూడా అపరిశుభ్రంగా వుండడంతో ట్యాంకు చుట్టూ పాచి వుండడంతో మంత్రి మండిపడ్డారు. మీ ఇళ్లల్లో ఇలాగే వుంచుతారా మీ పిల్లలకు ఇంటి వంటి చోట్ల నీరు తాగనిస్తారా అంటూ వారిని నిలదీశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా వుండాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను మంత్రి ఆదేశించారు. హాస్టల్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ఇవ్వాలని, ఎప్పటికప్పుడు వేడి ఆహారం వండి పెట్టాలని వార్డెన్‌కు స్పష్టం చేశారు. విద్యార్థులకు జలుబు, జ్వరం లక్షణాలు వుంటే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలన్నారు. బయటి ఆహారాన్ని హాస్టల్‌లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దన్నారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులను ఇంట్లో పిల్లల మాదిరిగా చూసుకోవాలన్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి పేరు పేరునా ఉపాధ్యాయ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు మంత్రి సవిత ఆకస్మిక తనిఖీకి రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. అప్పటికప్పుడు హాస్టల్ పరిసరాలను నీటితో శుభ్రం చేయడం ప్రారంభించారు. ఈ దృశ్యాన్ని చూసి మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తానొచ్చానని ఇప్పుడా శుభ్రం చేయడమని మండిపడ్డారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై మండిపాటు : మంత్రి సవిత స్టోర్ రూము, డైనింగ్ హాల్, వంటశాలను తనిఖీ చేశారు. స్టోర్ రూములో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో >>2

మదనపల్లెలో మళ్లీ సిఐడి తనిఖీలు 2లో

వార్త

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తరువాత తరంవారే ప్రతిభను గౌరవించేది.

-కోల్టన్

అయోమయంలో అన్నదాతలు!

రుణమాఫీ అయినటువంటి లబ్ధిదారులు 24 లక్షలు కూడా దాటలేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. రేషన్ కార్డులేకపోయినా రుణమాఫీ అవుతుందని జీవోలో చెప్పినాకూడా రేషన్ కార్డును కీలకంగా తీసుకొని మాఫీ చేస్తున్నారని చెప్పడంతో అంతగందరగోళం మొదలైంది.అందరికి రేషన్‌కార్డు ఉన్నా కరోనా సమయంలో గ్రామాలకు వెళ్లడంవల్ల రేషన్ తీసుకోకపోవడంతో వారికి రేషన్ కట్అయింది. ఈవిధంగా అనేక కారణాలవల్ల రుణమాఫీ కావడంలేదు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకపర్పాట్లు చేసింది.కానీ దీంతో ఎంతమందికి రుణమాఫీ అవుతుందనే విషయం ఇప్పుడే చెప్పలేం. ప్రభుత్వం రుణమాఫీ చేయాలనే బలమైన సంకల్పం ఉన్నప్పటికీ మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా కనిపిస్తుంది.

మోటె చిరంజీవి

కడుపునిండా అన్న పెట్టే రైతన్న ఇప్పుడు కడుపు మండి రోడ్డు ఎక్కుతున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ గ్రామానికి వెళ్లినా రుణమాఫీ అనేటువంటి పదమే ఎక్కువగా వినిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం వరంగల్ వేదికగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్‌పార్టీ ప్రకటించింది. ఆగస్టు 15వ తేదీలోపు ఎంత మంది రైతులుంటే అంత మందికి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని పిసిసి అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 15వ తేదీన రూ.2లక్షల రుణమాఫీని ఖమ్మం జిల్లా వైరాలో ప్రారంభించారు. ఇక అప్పటివరకు రుణమాఫీ అవుతుందని సంతోషంలో ఉన్నటువంటి రైతన్నలకు కన్నీళ్లే మిగిలాయి. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రైతు రుణమాఫీ చేసింది. అయినా పలు సాంకేతిక కారణాలు, రేషన్ కార్డులేదని, పాసుపుస్తకాలు లేవని, పేర్లు గల్లంతయ్యాయని, తీసుకున్న రుణం వాయిదాల ప్రకారం వడ్డీ చెల్లించిన పలువురికి రుణమాఫీ కాలేదు. చాలామంది రైతుల ఖాతాల్లో నిధులు జమకాక ఆవేదన చెందుతున్నారు. రుణమాఫీకి అన్ని అర్హతలు ఉండి కూడా అకౌంట్లో డబ్బులు పడడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మంత్రులు, వ్యవసాయ శాఖ ప్రకటించినప్పటికి రైతుల ఆశలు అడియాశలే అవుతున్నాయి. ఎందుకంటే మంత్రులు చెప్పే విషయాలకు పొంతన లేకుండా ఉండడం ఈ సమస్యకు కారణం. దాదాపు 22 లక్షల మంది రైతుల రుణఖాతాల్లో రూ.18వేల కోట్లు జమ చేసిందని చెబుతున్నప్పటికీ జులై 18వ తేదీన రూ. లక్ష రుణాలు, జులై 20వ తేదీన రూ.లక్ష నుంచి లక్షన్నరలోపు రుణాల మాఫీ చేసింది. ఆగస్టు 15వ తేదీన ఈ లక్షన్నర నుంచి ఈ రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పినా చాలా మంది రైతులకు జమకాలేదు. దీంతో రైతులందరూ ఆగ్రహానికి ఎక్కడికక్కడ నిరసనలు, ధర్నాలు, చేపట్టారు. కొందరికి మాఫీ అయి, కొందరికి మాఫీ కాక మొదటి విడత నుంచి సరైన సమాచారం లేక, మాఫీ వివరాలు తెలియక ఆగమగమవుతున్నటువంటి రైతులకు మూడో విడతలోనూ అదే నిరాశ ఎదురవడంతో సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇదిగో చేశాం, అదిగో చేసామంటూ ఆర్భాటంగా గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది ఏమీ లేదంటూ అర్హత ఉన్నా ఎందుకు చేయలేదంటూ రైతన్నలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇక కొన్ని గ్రామాల్లోని రైతులకు ఎవరికి కూడా రుణమాఫీ కాలేదని చెబుతుండగా, అన్ని అర్హతలున్నా కూడా రుణమాఫీ కాలేదని కొంత మంది రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక అప్పులున్న రైతుల సంఖ్య 70లక్షలుంటే రుణమాఫీ అయింది 22 లక్షల మందికి మాత్రమే. ఎస్ఎల్‌బిసి లెక్క ప్రకారం మాఫీకి అర్హులైనటువంటి రైతుల రుణాల మొత్తం రూ.49,500 కోట్లు అవసరం ఉండగా, తొలుత ముఖ్యమంత్రి రూ. 40 వేల కోట్లు అవసరమని తెలిపారు. ఆ తర్వాత మాఫీ కోసం కేబినెట్‌లో రూ.31వేల కోట్లు ఫైనల్‌చేసి, రుణమాఫీకి రూ. 26వేల కోట్లు బడ్జెట్‌లోపెట్టి, చివరికి మాఫీచేసింది మాత్రం రూ.17,933 కోట్లు మాత్రమే. అయితే ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితులలో బ్యాంక్ అధికారులను,వ్యవసాయ అధికారులను రైతులు అడగగా రెండు లక్షలకుపైనున్నటువంటి వాటిని రైతులు బ్యాంకులలో కట్టుకున్నట్లుయితే మీకు మాఫీ వర్తిస్తుందని చెప్పడంతో బ్యాంకులలో రూ. 2లక్షలకు పైన ఉన్నటువంటి వాటిని కూడా కట్టడం జరిగింది. ఇటువంటి రైతులకు కూడా రుణమాఫీకాలేదని వారు వాపోతున్నారు. దీంతో చివరికి బ్యాంకుల చుట్టూ రైతులు తిరుగు

తూ రుణమాఫీ ఎందుకు కాలేదు అంటూ బ్యాంకర్లను నిలదీస్తున్నారు. యేటా వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకుంటున్నా కాపీ కాలేదని, పెండింగ్‌లో ఉన్నవాళ్లకి మాఫీ అయిందని కొంత మంది రైతులు బ్యాంకు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అసలేం జరిగిందో, ఏ ప్రాతిపదికన మాఫీ చేశారో తెలియని బ్యాంకర్లు జవాబుచెప్పలేక, రైతుల్ని ఏమీ అనలేక ఆపసోపాలు పడుతున్నారు. తెలంగాణలో రైతుల సంఖ్య భారీగా పెరగడం, అదే విధంగా సాగు విస్తీర్ణం కూడా భారీగా పెరగడంతో, రైతులు తీసుకున్నటువంటి పంట రుణాల మొత్తం కూడా పెరిగింది. ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి పెట్టి రుణమాఫీని సీరియస్‌గా తీసుకుంది. రూ. రెండు లక్షలకు మించి రుణాలున్న రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ తెలిపింది. ఉదాహరణకు రూ. రెండు లక్షల యాభైవేలు రుణం ఉంటే రెండు లక్షలకుపై ఉన్న యాభైవేలను బ్యాంకులో జమచేస్తే ప్రభుత్వం ఇవ్వాల్సినటువంటి రూ. రెండు లక్షలు బ్యాంకులో జమచేస్తుంది. వీరిని కలుపుకుంటే రుణమాఫీ మొత్తం మరింత పెరిగేటువంటి అవకాశం ఉంటుంది.కానీ వ్యవసాయ అధికారులకు మాత్రం డిసెంబరు 2023వరకు లోన్లు తీసుకున్నటు వంటి రైతులకు సంబంధించినటువంటి డాటా మాత్రమేవారి దగ్గర ఉంది. అదే డాటాను చూసి వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పది నుండి 15 రోజుల వ్యవధిలో రైతులకు రుణం మాఫీ అవుతుందని తెలుపుతున్నారు. రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్న రైతుల అకౌంట్లో డబ్బులు జమ కాకపోవడానికి కొన్ని కారణాలు ఉంటున్నాయి. అవేంటంటే రేషన్‌కార్డు లేకపోవడంతో ఫ్యామిలీ నిర్ధారణ లేకపోవడం, ఆధార్ కార్డులో తప్పులు, బ్యాంకు ఆధార్ వివరాల్లో తేడాలు, పట్టాదారు పాసుపుస్తకం లేకపోవడం, అసలు వడ్డీ లెక్కల్లో తేడాల కారణంగా చాలా మందికి రుణమాఫీ కాలేదు. అయితే వీరికి న్యాయం చేయడానికి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తుంది. ఈ మేరకు వ్యవసాయశాఖ జులై 15వ తేదీన జారీచేసిన జీవో నెంబర్ 567కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ఇందులో ఫిర్యాదుల నమోదు పరిష్కారానికి సంబంధించినటువంటి కొన్ని మార్గదర్శకాలు, సూచనలు చేసింది. రుణమాఫీ కానీ వారి ఇంటికి వెళ్లి తప్పులను సరిచేసి, క్రాప్ లోన్ వివరాలను పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రైతు రేషన్ కార్డు వంటి ఇతర గుర్తింపు పత్రాలను రైతుల నుంచి సేకరించి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించింది. ఒకవేళ రేషన్ కార్డు లేక కుటుంబ నిర్ధారణ కార్డు లేకపోతే మండల వ్యవసాయ అధికారి రైతుల ఇంటికి వెళ్లాలి. రైతు తెలిపినటువంటి కుటుంబ వివరాలు అప్లోడ్ చేయాలని తెలిపింది. ఇటీవల బ్యాంకర్లతో కూడా ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా కొన్ని విధి విధానాలను రూపకల్పన చేసింది. తీసుకున్నటువంటి రుణం వడ్డీ మొత్తంలో తేడా వస్తే రైతు నుంచి దరఖాస్తు తీసుకోవాలని, రుణం ఎంత తీసుకున్నారు, ఎప్పుడు తీసుకున్నారు. వడ్డీ ఎంత అయింది, అసలు వడ్డీ కలిపి మొత్తం ఎంత అనేటువంటి వివరాలను పేర్కొంటూ పోర్టల్‌లో అధికారులు అప్లోడ్ చేయాలని సూచించింది. తప్పులను సరిదిద్దమని, సంబంధిత బ్యాంకులకు వివరాలను పంపించాలని తెలిపింది. ఏదిఏమైనా రైతుల్లో కొంత గందరగోళం నెలకొన్న మాట వాస్తవం. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చినప్పుడు అందరి ఓట్లు కావాలి కానీ రుణమాఫీ చేసేటప్పుడు రైతులందరికీ చేయాలనేటువంటి ఆలోచన లేదని రైతులువాపోతున్నారు. గతంలో రుణమాఫీ అయి, ఇప్పుడు ఎందుకు కాదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నవారు చెప్పేటువంటి విషయాలకు ఒకరికి ఒకరికి పొంతన లేకపోవడం వల్ల ఈ సమస్య మొదలైందని కొంతమంది విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి విడత రూ.లక్ష రుణమాఫీ కోసం జూన్ 18న రూ. 6098 కోట్లను, రెండో దశలో లక్షన్నర రుణాల మాఫీ కోసం రూ.6019 కోట్లను, మూడో విడతలో రెండు లక్షల రుణమాఫీ కోసం రూ. 8000 కోట్లు బ్యాంకులో వేశామని చెబుతున్నా రుణమాఫీ అయినటువంటి లబ్ధిదారులు 24 లక్షలు కూడా దాటలేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. రేషన్ కార్డు లేకపోయినా రుణమాఫీ అవుతుందని జీవోలో చెప్పినాకూడా రేషన్‌కార్డును కీలకంగా తీసుకొని మాఫీ చేస్తున్నారని చెప్పడంతో అంతగందరగోళం మొదలైంది. అందరికి రేషన్‌కార్డు ఉన్నా కరోనా సమయంలో గ్రామాలకు వెళ్లడం వల్ల రేషన్ తీసుకోకపోవడంతో వారికి రేషన్ కట్ అయింది. ఈ విధంగా అనేక కారణాలవల్ల రుణమాఫీ కావడం లేదు. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకపర్పాట్లు చేసింది.కానీ దీంతో ఎంతమందికి రుణమాఫీ అవుతుందనే విషయం ఇప్పుడే చెప్పలేం. ప్రభుత్వం రుణమాఫీ చేయాల నే బలమైన సంకల్పం ఉన్నప్పటికీ మూడు అడుగులు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా కనిపిస్తుంది. ●

ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న కాలుష్యం

కాలుష్య నివారణకై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యంకాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా పాలకులు కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలు,చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం రోజురోజుకు విషతుల్యంగా మారిపోతున్నది. ఫలితంగా కోట్లాదిమంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై అసువులు బాస్తున్నారు. దేశంలో అంతకంతకు ఈ కాలుష్యమేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. నగరాల్లో పరిస్థితి రోజురోజుకు మరింత దారుణంగా తయారవుతున్నది. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్‌టీఇటీ) తాజాగా భారత్‌లోని 76 నగరాల్లో వాయుకాలుష్యంపై చేసిన అధ్యయనంలో అనేక విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాలుష్యం తగ్గించేందుకు క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నిర్దేశించిన లక్ష్యాల్లో కొన్ని నగరాలు మాత్రమే రాబోయే రోజుల్లో లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది. జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేని 131 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు 2019లో క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2030 నాటికి కేవలం ఎనిమిది నగరాల్లో ఉద్గారాలను నలభై శాతం తగ్గించగలమని ఈ అధ్యయనాన్ని బట్టిఅంచనా వేస్తున్నది. 2019తో పోలిస్తే 2030 నాటికి ఆయా నగరాల్లో ఉద్గారాలు పదకొండు నుంచి నలభై శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడిస్తున్నది. వాయుకాలుష్యాన్ని నగరాలు అరికట్టేందుకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించకపోతే 2030 నాటికి హానికరమైన వాయుకాలుష్యం పెరుగుతుందని హెచ్చరించింది. వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పరిశ్రమలు, రవాణా, నిర్మాణం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చివేత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. ఇప్పుడే కాదు అంతకు ముందు కూడా ఎన్నో అధ్యయనాలు కాలుష్య ప్రమాదం గురించి అనేక హెచ్చరికలు చేశాయి. కానీ అందుకు తగినట్టుగా పాలకులు చర్యలు తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా చలికాలం వస్తుందంటేనే కొన్ని నగరాల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. కాలుష్యం కారణంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయంటే అర్థం చేసుకోవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలోనే కాదు, అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నట్లు వార్తలు అందుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా, ముంబయి నగరాలతోపాటు దక్షిణాదిన బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో వాయునాణ్యత క్రమేపీ క్షీణిస్తున్నది. ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా రోగధూళి విస్తరిస్తుందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పర్యావరణం, నీటి, గాలి నాణ్యత, వాతావరణంలోని మార్పులు, అటవీ విస్తీర్ణం చెత్త నిర్వహణ తదితర అంశాలపై దేశంలోని ఆరు మెట్రోనగరాల్లో జరిపిన సర్వేలో అనేక విషయాలు వెలుగు చూశాయి. వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందనే విషయం వెలుగుచూసింది. కొన్నినగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నట్లు వెల్లడయింది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయుకాలుష్యంతోపాటు నిర్మాణ రంగం వల్ల పీల్చేగాలిలో ధూళికణాలు అధికంగా ఉన్నట్లు బయటపడింది. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి తదితర రాష్ట్రాల్లో నిబంధనలు అమలు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందనే చెప్పొచ్చు. అంతర్జాతీయంగా ప్రధానంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో నిర్దిష్టమైన ప్రణాళికలతో పటిష్టమైన చర్యలతో సఫలీకృతమవుతున్నట్లు అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన ఐదువందలకుపైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించింది. అడవుల సంరక్షణకు ప్రత్యేక దృష్టిసారించింది. మనదేశంలో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించిన పొగవదులుతున్న వాహనాల సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నోచట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలు విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అయినా ఆశించిన ఫలితాలు రావడం లేదు. వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, దుమ్ముధూళి పేరుకుపోతున్నది. పెట్రోల్ డీజిల్‌లో జరుగుతున్న కల్తీ ఈ కాలుష్యాన్ని మరింత పెంచుతున్నది. మొత్తం మీద ఈ కాలుష్యం వల్ల పర్యావరణం విషతుల్యమై ప్రజలు అనేక వ్యాధులకు లోనవుతున్నారు. భావితరం బాలబాలికల బతుకు దీపాలను కాలుష్యం చిదిమేస్తున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వాయుకాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మార్చి గుండె జబ్బులకు కారణమవుతున్నది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

మనిషి ఎలా మరణించాడన్నది ముఖ్యం కాదు. ఎలా జీవించాడన్నది ముఖ్యం.

వాల్టర్ స్కాట్

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

సి.డబ్ల్యు వెండెల్

ఎంపాక్స్ వ్యాధిపట్ల ఆందోళన అవసరమా?

డాక్టర్ టి. సేవకుమార్

కరోనా వైరస్ విధ్వంసం చూశాక ప్రపంచంలోని దేశాలన్నీ, ఏరకమైన వైరస్,ఏ దేశంలో వ్యాప్తి చెందుతున్నా ఆందోళనలను మొదలవటం సహజమైపోయింది. అంతగా కరోనా వైరస్ ప్రజల్ని భయపెట్టిందని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కరోనా వ్యాప్తి సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సరైన దిశానిర్దేశం చేయలేదన్న విమర్శలు వచ్చిన నేపథ్యంలో తర్వాత ఏదేశంలో ఏ వైరస్‌వ్యాప్తి చెందుతున్నా సత్వర స్పందన కనబడుతోంది. ఎంపాక్స్ విషయంలో అదే జరిగింది. ఎంపాక్స్‌గా పేర్కొంటున్న మంకీ ఫాక్స్ వ్యాప్తిని 2022లోనే కొన్ని దేశాలలో గుర్తించడం జరిగింది. ఇప్పటి వరకు 116దేశాలలో 16వేల మందికిపైగా ఎంఫాక్స్ సోకితే అందులో కేవలం 560 మంది మాత్రమే మరణించినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఆఫ్రికా దేశాలలో ప్రతియేటా వ్యాధి కనిపిస్తూనే ఉంది. అయితే ఇటీవల డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందడం, ఆఫ్రికా ఖండంలోని మరికొన్ని దేశాల్లో గుర్తించడం, తర్వాత ఆఫ్రికా ఖండాన్ని దాటి స్వీడన్, మనపక్క దేశం పాకిస్థాన్‌లో ఎంపాక్స్‌ను గుర్తించడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ, సభ్యదేశాలను అప్రమత్తం చేసింది. ఎంపాక్స్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. మన కేంద్రప్రభుత్వం కూడా వెంటనే స్పందించి విమానాశ్రయాలు, నౌకాశ్రయాలలోనూ నిఘా, నిరోధక చర్యలు చేపట్టింది. గతంలో మనదేశంలో 30పైగా ఎంపాక్స్ కేసులు గుర్తించడం జరిగింది. గత సంవత్సరం కేరళలో ఒక కేసును అధికారికంగా ప్రకటించడం జరిగింది. ప్రపంచంలో ఏ వ్యాధి వ్యాప్తి చెందినా తొలుత కేరళలోనే గుర్తించడం జరుగుతుంది. కేరళీయులు ప్రపంచ వ్యాప్తంగా చాలాదేశాల్లో ఉద్యోగం చేస్తుండడం, తరచూ సొంత రాష్ట్రానికి వచ్చిపోతుండటమే అందుకు కారణం. ఎంపాక్స్ అంత ప్రమాదకరమైనది ఏమీకాదు. కోతుల ద్వారా వ్యాప్తి చెందుతున్నదని తొలుత అనుకున్న తర్వాతఎలుకలు, ఉడతలు, చింపాంజీలతో కూడా వ్యాప్తి చెందుతున్నదని గుర్తించారు. ఇదొక జూనోటెక్ వ్యాధి, అంటే జంతువుల నుండి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధి. అయితే ఇది మనుషుల నుంచి మనుషులకు కూడా వ్యాప్తి చెందుతుంది. అందువలనే వ్యాప్తి చెందుతున్న దేశాలలో ఆందోళన మొదలైంది. ముందస్తు నివారణ చర్యలను చేపట్టాయి. ఎంపాక్స్ కలిగిన జంతువులు, మనుషులద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వైరస్‌సోకిన జంతువుల,మనుషుల మలమూత్రాలలో, లాలాజలం ఇతర శరీర ద్రవాలలో వైరస్ ఉంటుంది. శరీర చర్మంలో గాయాలు ఉన్న,నోరు ముక్కు కళ్లు వంటి ప్రాంతాలలోని మ్యూకస్ మెంబ్రేన్‌పైన పడినా వైరస్ శరీరంలో తేలికగా ప్రవేశిస్తుంది. వైరస్ శరీరంలోకి ప్రవేశించి వారందరిలోనూ లక్షణాలు బయటపడవు. కొద్ది మందిలో మాత్రమేలక్షణాలు బయటపడతాయి.వీరిలోకూడా రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవృద్ధులు,చిన్నపిల్లలు, మధుమేహం, కేన్సర్‌బారినపడిన వారిలో లక్షణాలు బయటపడతాయి. ఈలక్షణాలు బయటపడడానికి ఏడురోజుల నుండి 14రోజుల సమయం పడుతుంది.లక్షణాల విషయానికి వస్తే జ్వరం,ఒళ్లునొప్పులు, గొంతు నొప్పి, లింపు గ్రంథాల వాపు వంటి లక్షణాలు ఉంటాయి. చర్మం మీద దద్దుర్లు వస్తాయి. తర్వాత పొక్కులుగా మారతాయి. వీటిలో పస్ ఉంటుంది. అవి తర్వాత మచ్చలుగా ఏర్పడతాయి. ఎంపాక్స్‌ను ఆర్టిపిసిఆర్ పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చును. ఎంపాక్స్‌కు ప్రత్యేకమైన చికిత్స ఏదీ లేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్స చేయడమే. ప్రజలు కూడా చైతన్యవంతులు కావాలి. ●

ప్రజావాక్కు

శిశు సంరక్షణ నిలయాలు ఏర్పాటు చేయాలి

దక్షిణ భారతదేశంలో బొగ్గు గనులు ఉన్న ఏకైక సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్నది. ఇంధనం విద్యుత్‌కు అవసరమయ్యే బొగ్గునుసరఫరా చేస్తుంది. సంస్థపరంగా, ఇతరత్రా దాదాపు రెండువేలకుపైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ మహిళలకు ప్రత్యేకంగా అవసరమయ్యే విశ్రాంతిగదులు శిశుసంరక్షణ నిలయాలు కల్పించబడలేదు. ఫలితంగా వారు చాలా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శిశుసంరక్షణ నిలయాలు లేకపోవడం వలన పిల్లలఆలనా పాలనా కోసం పరితపిస్తూ తల్లడిల్లిపోతుంటారు. మరోపక్క విధులకు న్యాయం చేయలేకపోతున్నామని మనోవేదనకు గురవుతున్నారు. ఫ్యాక్టరీ మైన్స్ చట్టాలు మహిళలకు ప్రత్యేకంగా విశ్రాంతి శిశు సంరక్షణ నిలయాలు ఏర్పాటు చేయాలి.

-దండంరాజు రాంచందర్‌రావు, హైదరాబాద్

అర్హులకు అందని రుణమాఫీ

బాగా దుడ్లు ఉన్న మోతుబరి రైతులకి తమ పార్టీకి సానుభూతి పరులైన రైతులకి అసలు రైతులే కాని మోసగాళ్లకి రుణమాఫీ చేసి సన్నకారు రైతులని నిర్లక్ష్యం చేసిన పార్టీ ఒకటయితే రైతుల ఆదాయం రెట్టింపుచేస్తామని చెప్పి వందలాది మందిరైతుల మరణాలకు కారణమైన పార్టీ మరొకటి. ఇలాంటి పార్టీలకి చెందిన నాయకులు ఇప్పుడు రైతులపై ప్రేమను ఒలకపోస్తూ వారికోసంఆందోళనలు,ధర్నాలు చేయడానికి సిద్ధపడుతున్నారు.విడతలవారీగా అర్హులందరికి కచ్చితంగా రుణమాఫీ చేసి తీరుతామని ఎంతగా చెబుతున్నా వినకుండా ప్రభుత్వంపై ఒంటికాలుపై లేస్తున్నారు. పరిస్థితిని చిలికి చిలికి గాలివానలా మారుస్తున్నారు.

-ఎం.ఎస్‌శర్మ,హైదరాబాద్

హైడ్రా నిర్ణయం సరైందే

హైడ్రా వారు హైదరాబాద్‌లో చేపడుతున్న చర్యలు స్వాగతించవలసిందే. కాకతీయుల కాలం నాటి సంస్కృతిని కాపాడవలసిందే. ఇతర జిల్లాలకు కూడా దాని విస్తరణ జరగాలి. తెలంగాణలోనే ఒక్కొక్క చెరువు 29 ఎకరాలలో విస్తరించే అపురూప రాష్ట్రం దానికి ప్రజల నుండి కూడా మంచి స్పందన వస్తుండడం మంచి పరిణామం.

-భారత అవినాష్, జనగామ

ఆస్పత్రుల బాగోతం

చేయని వైద్యాలకు కూడా భారీ బిల్లులు వేసే ప్రైవేట్ ఆస్పత్రుల తీరు మళ్లీ గుట్టు రట్టయింది. సిఎం రిలీఫ్ ఫండ్‌నీ కూడా కొన్ని ఆస్పత్రుల వారు పక్కదారి పట్టించడం దారుణం. పేద వ్యక్తి ఆపదలో తీవ్ర అస్వస్థతకు గురైతే వెంటనే సిఎం రిలీఫ్ ఫండ్అందిస్తారు. ఇది ఎంతో గొప్పపథకం.పార్టీలకు అతీతంగా అందరికీ ఇది ఎంతోఉపయోగకరంగా ఉంది. కానీ నేడు దాన్ని కూడా పక్కదారి పట్టించడం హేయం. కొందరు కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కై వైద్యం చేయకుండా బిల్లులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆ ఆస్పత్రుల మీద కేసులు నమోదు చేయాలి.అలాగే ఇన్సూరెన్స్ ఉన్నవారికి అవసరంఉన్నా లేకున్నా అన్నీ టెస్టులు చేసి భారీ బిల్లులు వసూలు చేసే కార్పొరేట్ ఆస్పత్రుల మీద కఠిన చర్యలు తీసుకోవాలి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

కఠిన శిక్షలు విధించాలి

ప్రజానాయకులు, అభిమానులను అలరించే నటులు చేస్తున్న నాటకాలు అరాచకాలు చూస్తుంటే ప్రజలు ఎంత మోసపోతున్నారో అభిమానులు ఎంత కలవరపడుతున్నారో ఈ హైడ్రా వ్యవహారంతో తేలిపోయింది. అసలు వీళ్లని ఎందుకు గౌరవించాలో తెలియడం లేదు. అడ్డగోలుగా ఆక్రమణలు చేసి విపరీత ముంపులకు దారితీసి ఎంతో మంది పేద కింది, మధ్యతరగతి కుటుంబాలను చెల్లచెదురు చేసిన ఈ కబ్జాదార్లను కఠినంగా శిక్షించాలి. ఇన్నాళ్లు కొల్లగొట్టిన డబ్బుతో పాటు క్రిమినల్ శిక్షలు అంటే దీర్ఘకాలిక జైలు శిక్షలు విధించాలి. ఈవిషయాలలో ఎవ్వరూ వారికి మోరల్ సపోర్టు గాని, రాజకీయం గాని చేయకూడదు. అలాచేస్తే కచ్చితంగా అన్యాయానికి అక్రమాలకి కొమ్ముకాసిన వారే అవుతారు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

ఇక్కడి పరిస్థితులు అలానే ఉన్నాయి

మధ్యతరగతి, పేద ప్రజలు, యువత, మహిళలు, రైతులు వివిధ వర్గాలవారు ఎన్నోసమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వారిని చాలా ఇబ్బందులు పెడుతోంది. రూపాయి విలువ పతనం,ద్రవ్యోల్బణం,విద్వేష రాజకీయాలు,ఘరానా మోసగాళ్లు, బ్యాంకు దోపిడీలు, నిరుద్యోగం, నిరంకుశత్వం ఇంకా అనేక సమస్యలు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. తమకు మంచి రోజులు వస్తాయని ఎదురు చూస్తున్నారు. అయితే వారి ఓపిక, సహనం నశించి ప్రభుత్వంపై తిరగబడితే ఏమవుతుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

దేశాభివృద్ధిలో మధ్యతరగతి ప్రజల పాత్ర

ఐ.ప్రసాదరావు

దేశానికి ప్రధాన చోదక శక్తి మధ్యతరగతి ప్రజలు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, ఇటు కేంద్ర ప్రభుత్వం కానీ, అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ పట్టించుకోని సుమారు 45 శాతం జనాభా ఉన్న పెద్ద సమూహం ఈ మధ్యతరగతి ప్రజలు. పేదలకు పథకాలు, ధనవంతులకు రాయితీలు కుమ్మరించే ఈ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యతరగతి వారికి చేసే పనులు ఏమిటో, చేపట్టిన చర్యలు ఏమిటో ఇకనైనా స్పష్టంగా చెప్పాలి. ఓట్లు రాబట్టుకునే విధంగా కులాల వారిగా పథకాలు ప్రకటించడం తప్ప, వాస్తవానికి ఈ వర్గ ప్రజలకు విద్యవైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. నేటి భారతీయ సమాజంలో పేదవారు అని చెప్పుకోలేక అలాగని ధనికులం అని చెప్పుకోలేక త్రిశంకు స్వర్గంలో వేళాడుతున్న కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల సాధక బాధకాలు చెప్పుకోలేనివి. సగటున నెలకు 15వేల నుంచి 60వేల రూపాయలు సంపాదించే వర్గాన్ని మధ్యతరగతి ప్రజలుగా పరిగణిస్తే వీరి ఆదాయం కేవలం నలుగురు సభ్యులతో ఓ సాధారణ జీవితాన్ని గడపవచ్చు.కానీ 1990 తరువాత దేశంలో అమలులోకి వచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలు వలన ఈ మధ్య తరగతి ప్రజలు తమ సంపాదనలో నూటికి 60 శాతంపైబడి కేవలం విద్య, వైద్యం కోసం వెచ్చించడం జరుగుతుంది. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా రైతులు, సామాన్య కార్మికులు ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంఘటిత కార్మికులు వంటి వారు ఈ కోవలోకి వస్తారు. జీవితాంతం తరతరాలుగా ప్రభుత్వాలకు పన్నులు చెల్లించేవర్గం కూడా ఈ మధ్యతరగతి ప్రజలే. అంతేకాకుండా పన్నుపోటుకు (ఇన్‌కం టాక్స్, జిఎస్టీ వంటి బాధితులు) గురయ్యేవారు కూడా ఎక్కువగా ఈ మధ్యతరగతి ప్రజలే. అదే సమయంలో దేశంలో వివిధ రంగాల్లో వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో పనిచేస్తూ దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో కీలకపాత్రధారులు వీరే. ఎంతో శ్రమించి వీరి పిల్లలను చదివించి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించి దేశానికి మంచి పౌరులను అందించే తరగతి. ఆ మాటకొస్తే ఇతర దేశాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొంది మనదేశానికి రెమిడెన్స్ ఎక్కువ మొత్తంలో విదేశీ మారకద్రవ్యం సమకూర్చేవారు ఈ మధ్యతరగతి కుటుంబ సభ్యులే. మరి ఇటువంటి సేవలు అందిస్తున్న మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వాలు ఇకనైనా సరైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. ముఖ్యంగా పన్నులు నుంచి కొంతమేరకు ఉపశమనం కల్పించాలి. విద్య,వైద్యం

ఉచితంగా కేజి నుంచి పిజి వరకు చదువు అందించాలి. నాణ్యమైన విద్య, వైద్యం ప్రభుత్వాలు సమకూర్చాలి. దేశాన్ని అభివృద్ధి పరుస్తామని ప్రతీ సంవత్సరం లక్షల కోట్ల రూపాయల రాయితీలు ప్రోత్సాహకాలు ధనవంతులకు అందించే ప్రభుత్వాలు మధ్యతరగతి ప్రజలను ఉపేక్షించడం సరైనది కాదు. దేశంలో అత్యధిక కొనుగోలు శక్తిని కలిగిన సమూహం కూడా మధ్యతరగతి ప్రజలే. సెల్‌ఫోన్ కొనుగోలులో,మోటార్ సైకిల్, కారు వంటివి, ఎసిలు, ఫ్రిజ్, టీవీలు, కంప్యూటర్ల వంటివి కొనేవారిలో ఎక్కువగా మధ్యతరగతి ప్రజలున్నారు. ప్రపంచంలో ఎక్కువ దేశాలు భారత్‌తో వర్తక వాణిజ్య ఆర్థిక సంబంధాలు పెట్టుకోవడానికి తహతహలాడటానికి ప్రధాన కారణం మధ్యతరగతి ప్రజలు ఉండటం వల్లనే అని గ్రహించాలి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన విద్యవైద్యం అందించాలి. చదువుకున్న వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. ఒకేషనల్ కోర్సులు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ఎంట్రీ, కంప్యూటర్, ఐటిఐ, పోలిటెక్నిక్, సేవారంగం, వ్యవసాయ పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యంఇవ్వాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి.కేవలం కొన్ని నగరాల్లో, పట్టణాల్లోనే పారిశ్రామీకరణ జరిగే విధానానికి స్వస్తి చెప్పాలి. నూతన విద్యా విధానంలో 'స్టెమ్' సబ్జెక్టులతో పాటు సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత కల్పించాలి. విద్యా,వైద్య రంగంలో ఖాళీ పోస్టులు భర్తీకి చర్యలు చేపట్టాలి. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి. మన పాలకులు భారత్ త్వరలో అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా మారబోతుంది అని చెబుతున్నా, సెన్సెక్స్ నిఫ్టీ సూచికలు లక్ష పాయింట్లు చేరినా మన అభివృద్ధి మాత్రం 'నేతి బీరకాయలో నేయ్య' ఉన్నట్లే ఉంటుంది. దీనికి నిదర్శనం ప్రస్తుతం మనం 'మానవ అభివృద్ధి సూచికలో 134వస్థానంలో ఉండటమే ప్రత్యక్ష సాక్ష్యం. కావున జిడిపి, జిఎస్టీ, స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ సూచీలు చూసి మురిసిపోరాదు. ఒక్కమాటలో చెప్పాలంటే మధ్యతరగతి ప్రజల అభివృద్ధి మీదనే దేశ వాస్తవ అభివృద్ధి ఆధారపడి ఉంది అని గ్రహించాలి. ముఖ్యంగా 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలంటే మధ్యతరగతి ప్రజల అభివృద్ధి మీదనే ఆధారపడి ఉంది అని పాలకులు గ్రహించాలి. వారి సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధికి ఇకనైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. అమలు చేయాలి. మధ్యతరగతి ప్రజలు నడ్డి విరిచే ధరలు పెరుగుదల, పన్నుపోటు, విద్యావైద్య ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. మినిమం బ్యాంకు బ్యాలెన్స్‌లేదు అని వేసే పెనాల్టీలు,లెక్కకు మించి ఎక్కువ సార్లు ఏటియం వాడారని వేసే వాతలు కూడా మధ్యతరగతి ప్రజల మీదే అని వాస్తవాన్ని గుర్తించి, ఉపసంహరణ దిశగా చర్యలుచేపట్టాలి. అదే సమయంలో రుణాలు ఎగ్గొట్టే బడాబాబులపై సానుభూతి తగ్గించే చర్యలు చేపట్టాలి. లేకపోతే దేశానికి పెనుసవాలుగా భవిష్యత్తు మారుతుంది. ●

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుని తప్పుడు సమాధానాలు

కోలకతా వైద్యురాలి హత్యాచార ఘటన..

కోల్‌కతా, ఆగస్టు 26: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించినప్పుడు ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా, వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకుముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్య బృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతి నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పుకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కనిపించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సిబిఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపరచగా సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

భారత్‌లోని ఇద్దరు దౌత్యవేత్తలపై బంగ్లా వేటు

ఢాకా, ఆగస్టు 26: బంగ్లాదేశ్‌లో అనిశ్చిత పరిస్థితుల వేళ భారత్‌లోని రాయబార కార్యాలయాల్లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్‌లో ఫస్ట్ సెక్రటరీగా కొనసాగుతున్న షబాన్ మహ్మద్, కోల్‌కతాలోని బంగ్లాదేశ్ కాన్సులేట్‌లో పనిచేస్తున్న రంజన్ సేన్‌పై ఈ వేటు వేసింది. తన పదవీకాలం ముగియడానికి ముందే రాజీనామా చేయాలని షబాన్‌ను బంగ్లా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రంజన్‌ను విధుల నుంచి తొలగించింది. ఇటీవల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన తీవ్ర హింసాత్మకంగా మారి వందల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘర్షణల నేపథ్యంలో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి దేశాన్ని వీడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆమె భారత్‌లోనే ఉన్నారు. హసీనా ప్రభుత్వం రద్దవడంతో అక్కడ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయింది. తమ ప్రభుత్వం అన్ని దేశాలతో స్నేహసంబంధాలు కొనసాగిస్తుందని యూనస్ తెలిపారు. ఇదిలా ఉంటే బంగ్లాదేశ్‌లో అడపాదడపా అల్లర్ల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఢాకాలో విద్యార్థులకు పారామిలిటరీ దళమైన అన్సార్ సభ్యులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో కనీసం 50 మంది వరకు గాయపడ్డారు. విలేజ్ డిఫెన్స్ ఫోర్స్‌గా పిలిచే అన్సార్ సభ్యులు తమ ఉద్యోగాలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా ఆందోళన చేపట్టారు. దీనిపై తాత్కాలిక ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వారు ఆందోళన విరమించారు. ఇది తెలుసుకున్న విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. ఢాకా యూనివర్సిటీ నుంచి సెక్రటేరియట్ వరకు మార్చ్ చేపట్టాయి. దీన్ని అన్సార్ సభ్యులు అడ్డుకున్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో అడ్వైజర్‌గా ఉన్న విద్యార్థి నాయకుడు నహీద్ ఇస్లామ్ సహా పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు మళ్లీ ఆందోళన చేపట్టారు. ఇది కాస్త హింసాత్మకంగా మారి ఘర్షణకు దారితీసింది.

లడఖ్‌లో 5 కొత్త జిల్లాలు..

అమిత్ షా కీలక ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 26: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌కు సంబంధించి కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ కొత్తగా అయిదు జిల్లాలను ఏర్పాటుచేసుకుంది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన లద్దాఖ్‌ను నిర్మించాలనే ప్రధాని మోడీ సంకల్పంలో భాగంగా ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో అయిదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేయబోయే జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్ జిల్లాలతో ప్రభుత్వ పాలన మరింత పటిష్టమవుతుంది. ప్రతిఇంటికి ప్రభుత్వ ఫలాలు అందుతాయి. లద్దాఖ్ ప్రజలకు అవకాశాలను సమృద్ధిగా అందించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని అమిత్‌షా అన్నారు. తాజా నిర్ణయంపై ప్రధాని మోడీ స్పందించారు. లద్దాఖ్ ప్రజల శ్రేయస్సు, మెరుగైన పాలనకు ఇదో ముందడుగు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు అవకాశాలు, సేవలు మరింత చేరువవుతాయి అని మోడీ హర్షం వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలకు అభినందనలు తెలియజేశారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. శాసనసభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా లద్దాఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పాలనా నియంత్రణలో ఉంటుంది. ప్రస్తుతం అక్కడ లేహ్, కార్గిల్ రెండు జిల్లాలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో ఈ జిల్లాల సంఖ్య ఏడుకు పెరగనుంది. లడక్‌లో కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రధానినరేంద్రమోడీ ఆజిల్లాలప్రజలకు అభినం దనలు తెలిపారు. కొత్తజిల్లాలతో ప్రజలు మరిం త మేలయిన సేవలు అందుతాయని ఆయన ఆకాంక్షించారు.

అభిషేక్ బెనర్జీ కుమార్తెకు అత్యాచార బెదరింపులు..

బాలల హక్కుల కమిషన్ సీరియస్

కోల్‌కతా, ఆగస్టు 26: కోల్‌కతా వైద్య విద్యార్థిని ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఓ వ్యక్తి తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కుమార్తెను అత్యాచారం చేస్తామని, అలా చేసిన వారికి భారీ రివార్డు అందచేస్తానని బెదిరించడం కలకలం రేపింది. ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించింది. నిరసనల్లో పాల్గొన్న ఓ వ్యక్తి అభిషేక్ బెనర్జీ మైనర్ కుమార్తెపై అత్యాచారం చేస్తామని బెదిరించినట్లు వినిపించింది. అంతేకాకుండా అలా చేసిన వ్యక్తికి భారీ నగదు అందచేస్తానని బహిరంగంగా ప్రకటించాడు. ఈ అసభ్యకరమైన వ్యాఖ్యలు, అతడి నీచమైన ఉద్దేశాన్ని తెలియచేస్తున్నాయి. అవి సదరు మైనర్ బాలిక గౌరవానికి భంగం కలిగించడంతో పాటు చిన్నారి భద్రతకు ముప్పు కలిగించేవే అని పశ్చిమ బెంగాల్ బాలల పరిరక్షణ కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీసులకు విజ్ఞప్తి చేసింది.

సూడాన్‌లో కూలిపోయిన డ్యామ్.. పదుల సంఖ్యలో స్థానికుల గల్లంతు

కైరో, ఆగస్టు 26: భారీ వర్షాల కారణంగా సూడాన్‌లో ఓ డ్యామ్ కుప్పకూలింది. దీంతో సమీప గ్రామాల్లోకి భారీగా వరద చేరింది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఆచూకీ లభించని వారితోపాటు ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య భారీగానే ఉన్నట్లు అంచనా వేసింది. సూడాన్‌లోని రెడ్ సీ స్టేట్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి అర్బాత్ డ్యామ్ కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. సుమారు 60 మంది వరకు మరణించి ఉండవచ్చని, అనేకమంది గల్లంతైనట్లు సూడాన్ వార్తా ఛానెల్ పేర్కొంది. మరో వార్తా సంస్థ మాత్రం 100 మంది ఆచూకీ లభించలేదని వెల్లడించింది. మొత్తంగా ఈ ఘటనలో నష్టం తీవ్రస్థాయిలో ఉందని రెడ్ సీ స్టేట్ నీటిపారుదల శాఖ అధికారి పేర్కొన్నారు. మొబైల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో సమాచార సేకరణ ఇబ్బందిగా మారినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

44 మందితో తొలిజాబితాను రద్దు చేసిన బిజెపి

మళ్లీ 12 మందితో జాబితా విడుదల

కొత్తనేతలకు సీట్లిచ్చారన్న నిరసనలే కారణం

జమ్ముకాశ్మీర్‌లో బిజెపికి అంతర్గత అసమ్మతిపోరు

శ్రీనగర్, ఆగస్టు 26: జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ మూడు దశల్లో జరిగే ఎన్నికలకోసం 44 మంది అభ్యర్థు లజాబితాను సిద్ధంచేసిన బిజెపి తర్వాత మళ్లీ వెంటనే తొలగించింది. ఆ తర్వాత కొన్ని గంటలకు మరోజాబితాను విడుదలచేసింది. మొదటిదశ ఎన్నికలకుగాను కేవలం 15మందితోకూడిన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. మొదటిదశ ఎన్నికల్లో అభ్యర్థుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఆతర్వాత కొన్ని గంటలకు కేవలం ఒకే ఒక్కపేరుతో మరో జాబితానుకూడా విడుదలచేసారు. తొలగించిన జాబితాలో మూడు కీలకపేర్లు గల్లంతయ్యాయి. జమ్ముకాశ్మీర్ బిజెపి అధ్యక్షుడు రవీందర్‌రైనా, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రులు నిర్మల్‌సింగ్, కవీందర్‌గుప్తాలపేర్లు కూడా కనిపించడంలేదు. కేంద్రమంత్రి జితేందర్‌సింగ్ సోదరుడు దేవేంద్ర రాణా పేరు కనిపించింది. ఇటీవలే నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి బిజెపిలోచేరిన ఆతనికి సీటు ఇచ్చారు. ఇద్దరు కాశ్మీరీ పండిట్లు, 14 మంది ముస్లిం అభ్యర్థులతో మొదటి జాబితాను సిద్ధంచేసింది. కాంగ్రెస్‌పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, పాంథర్స్ పార్టీలకు చెందిన అనేకమంది నేతలు బిజెపిలో చేరారు. వీరిపేర్లు కూడా తొలుత ప్రకటించి తర్వాత నిలిపివేసిన జాబితాలో ఉన్నాయి. కొన్ని కీలకమైన తొలగింపులకు కారణాలు కేవలం నాయకులనుంచి వచ్చిన వ్యతిరేకతలేనని తేలింది. మూడుదశలకు ఒకేసారి జాబితాలను ఇవ్వకుండా నిలిపివేసి దశలవారీగానే జాబితాలు ఇవ్వాలని నిర్ణయించింది. అందువల్లనే మళ్లీ మొదటి విడత ఎన్నికల జాబితాను విగులచేసింది. జమ్ముకాశ్మీర్ మూడుదశల్లో ఎన్నికలకు వస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబరు నాలుగో తేదీ ఓట్లలెక్కింపునకు వస్తుంది. బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ ఖరారుచేసినతర్వాత మొదటి జాబితా విడుదలయింది. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బిజెపి చీఫ్ జెపినడ్డాలు ముందురోజు కీలక సమావేశం జరిపి అభ్యర్థుల జాబితాను ఖరారుచేసారు. 2014లో ఎన్నికలు జరిగిన జమ్ముకాశ్మీర్ తర్వాత 370వ అధికరణం రద్దు కావడం రాష్ట్రపతి పాలనకువెళ్లడం వంటివి తెలిసిందే. ఆనాటి ఎన్నికల్లో బిజెపి జమ్ముప్రాంతంలో 25స్థానాలు గెలిచింది. పిడిపి 28 స్థానాలతో గెలిచి ఏకైక అతిపెద్ద పార్టీగా వచ్చింది. నేషనల్ కాన్ఫరెన్స్ 15 స్థానాలు, కాంగ్రెస్ 12 స్థానాలు గెలిచాయి. ఆ తర్వాత పిడిపి, బిజెపి కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసినాకొన్నాళ్లకే పరిమితం కాగా ప్రభుత్వానికి బిజెపి మద్దతు ఉపసంహరించి రాష్ట్రపతిపాలన విధించారు. ఇపుడు నేటి ఎన్నికల్లో జమ్ముకాశ్మీర్‌లో త్రిముఖ పోటీ నడుస్తోంది. బిజెపి పిడిపి నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్‌ల కూటమి మధ్య పోటీ జరుగుతోంది. దీనితో బిజెపి గట్టిపోటీ ఎదుర్కొంటుందనడంలో ఎలాంటి సందేహంలేదు. అంతకుముందు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే, ఇడియా కూటమి లోక్‌సభ నేత రాహుల్‌గాంధీ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఓమర్ అబ్దుల్లాలనుకలిసి సంప్ర దింపులు జరిపి తమ పొత్తులనుప్రకటించారు. జమ్ముకాశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్సీ కూటమి పేకమేడలా కూలిపోతుందని బిజెపి రాష్ట్ర ఇన్‌ఛార్జి తరుణ్ ఛుగ్ ఎద్దేవా చేసారు.

ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చేతికి 'సూసైడ్ డ్రోన్' ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించిన నియంత!

సియోల్, ఆగస్టు 26: నిత్యం క్షిపణులు, శక్తిమంతమైన బాంబుల పరీక్షలతో వార్తల్లో నిలిచే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేతికి మరో కొత్త ఆయుధం చిక్కింది. అదే సూసైడ్ డ్రోన్. వీటి పనితీరును కిమ్ శనివారం స్వయంగా పర్యవేక్షించారు వీటికి సంబంధించిన చిత్రాలను ఆ దేశ అధికారిక మీడియా సోమవారం విడుదల చేసింది. తమ యుద్ధ సన్నద్ధతను మరింత మెరుగుపర్చుకోవడానికి సూసైడ్ డ్రోన్ల తయారీని వేగవంతం చేస్తామని కిమ్ వెల్లడించారు ఎక్స్ ఆకారపు రెక్కలు ఉన్న ఓ తెల్లటి డ్రోన్.. దక్షిణ కొరియాకు చెందిన కె-2 యుద్ధ ట్యాంకును పోలి ఉన్న లక్ష్యాన్ని ధ్వంసం చేసినట్లు ఫొటోల్లో కనిపిస్తోంది. సాధారణ డ్రోన్లు లక్ష్యానికి కొంత దూరంలో ఉండి క్షిపణుల ద్వారా దాడి చేస్తాయి. తాజాగా ఉత్తర కొరియా ప్రయోగించినవి మాత్రం అవే నేరుగా లక్ష్యంలోకి దూసుకెళ్లి విధ్వంసం సృష్టిస్తాయి.
ఉత్తర కొరియా నుంచి దక్షిణ కొరియా, అమెరికాకు తరచూ అణ్వస్త్ర ప్రయోగ బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఇరు దేశాలు కలిసి సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. తద్వారా తమ ఆత్మరక్షణ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటున్నాయి. యుద్ధ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. ఈ తరుణంలో కిమ్ సూసైడ్ డ్రోన్ల ప్రయోగాలు తెరపైకి రావడం గమనార్హం. వివిధ దూరాలను ప్రయాణించగలిగే సామర్థ్యం ఉన్న పలు రకాల డ్రోన్లను శనివారం పరీక్షించినట్లు కెసిఎన్ఎ వెల్లడించింది. భూమితోపాటు సముద్రంలోని లక్ష్యాలను సైతం ఈ డ్రోన్లు ఛేదిస్తాయని పేర్కొంది. లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో దాడి చేయడానికి ముందు ఈ డ్రోన్లు వివిధ మార్గాల్లో ప్రయాణించాయని తెలిపింది. అంతర్జాతీయ సైనిక సామర్థ్యాలు, ఆత్మరక్షణ వ్యవవస్థలను పరిశీలిస్తే డ్రోన్లు వంటి అత్యాధునిక సాంకేతికత ఎంత అవసరమో తెలుస్తోందని కిమ్ అన్నారు. ఈ నేపథ్యంలో వీటిని వీలైనంత త్వరంగా సైన్యంలో చేర్చాలని అధికారులను ఆదేశించారు. యావత్ ప్రపంచం రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్‌లపై దృష్టి సారించిన తరుణంలో కిమ్ తమ అణ్వస్త్ర సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించారు తరచూ అమెరికా, దక్షిణ కొరియాకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అమెరికాలోని లక్ష్యాలను సైతం చేరుకునే దీర్ఘశ్రేణి క్షిపణులను రూపొందిస్తున్నారు. అదే సమయంలో పొరుగున ఉన్న దక్షిణ కొరియాను లక్ష్యంగా చేసుకునే స్వల్పశ్రేణి ఆయుధాలను సైతం సిద్ధం చేసుకుంటున్నారు. అమెరికాలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ దేశంపై ఒత్తిడి పెంచాలనేనే కిమ్ లక్ష్యమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తద్వారా తమ దేశాన్ని అణ్వస్త్ర దేశంగా గుర్తించాలని కిమ్ ఆశిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా ఆర్థిక, సైనికపరమైన ఆంక్షలనుంచి ఉపశమనం పొందాలనేది ఆయన లక్ష్యమని వివరించారు.

వరదనీటిలో కొట్టుకుపోయిన ట్రాక్టర్ ట్రాలీ

10మందిని రక్షించినా, ఏడుగురి ఆచూకీ గల్లంతు

అహ్మదాబాద్, ఆగస్టు 26: ట్రాక్టర్‌ట్రాలి ఒకటి వరదల్లో కొట్టుకునిపోవడంతో మొత్తం 17 మంది వరదల్లో చిక్కుకున్నారు. గుజరాత్‌లోని ధవానా గ్రామంలో భారీ వర్షాలకు వచ్చిన వరదలకుగాను ప్రయాణీకులతో వస్తున్న ట్రాక్టర్‌ట్రాలీ కొట్టుకునిపోయింది. ఈ సంఘటనలో పదిమందిని రక్షించిన ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది మరో ఏడుగురి

ఆచూకీకోసం గాలిస్తున్నారు. కేంద్రానికి సమాచారం అందడంతో హోంమంత్రి అమిత్‌షా వెంటనే ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్‌తో చర్చలు జరిపారు. రాష్ట్ర హోంమంత్రి హర్ష్‌సంఘావి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు భారీ వర్షాలు మరికొన్ని రోజులు ఉంటాయని వాతావరణ శాఖ నివేదికలను అందచేసారు. కాగా ట్రాక్టర్‌ట్రాలీ ఘటనకు సంబంధించి మోర్బి కలెక్టర్ ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక ఇచ్చారు. కాజ్‌వేను భారీ వరదనీరు ముంచెత్తడంతో ఈప్రమాదం జరి గిందని, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికూడా ఇప్పటివరకూ పదిమందిని రక్షించారని, మిగిలిన వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈసంఘటనతో ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అదికారులతో విడియో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ 17,827 మందిని ఖాళీచేయించారు. 1653 మందిని వరదనీటిలో కొట్టుకునిపోకుండా కాపాడగలిగారు. ఎన్డీఆర్‌ఎఫ్ 13 దళాలుంటే ఎస్డీఆర్‌ఎఫ్ 22 టీమ్‌లు న్నాయి. మొత్తం 33 జిల్లా ల్లోని 244 తాలూకాల్లో ఈ తుపాను ప్రభావం ఉంది. ఇటీ వలికాలంలోనే 63.36 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. నవ్ సారి జిల్లాలోని ఖేర్‌గామ్‌లో అత్యధికంగా 356 మిల్లీమీటర్లు కురిసింది. మొత్తం 206 రిజర్వాయర్లలో 59 రిజర్వాయర్లు పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం 72 రిజర్వాయర్లు హై అలర్ట్‌లో ఉన్నాయి. 22 సాధారణ అలర్ట్‌లు జారీచేసారు. తొమ్మిది రిజర్వాయర్లకు వరదహెచ్చరికలు ఉన్నాయి. ఏడు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. సర్దార్ సరోవర్ డామ్ 88.75శాతం స్టోరేజి సామర్థ్యంతో ఉంది.
7009 గ్రామాలకు విద్యుత్‌సరఫరాల్లో తరచూ అంతరాయం ఏర్పడింది. ఇప్పటివరకూ 6977 గ్రామాల్లో పునరుద్ధరించారు. 6090 విద్యుత్ స్తంభాలు కూలిపోగా వాటిలో 5961 వరకూ పునరుద్ధరణ జరిగింది. 523రోడ్లు పూర్తిగా మూసి వేసారు. సూరత్, నవ్‌సారి, వల్సాద్, తాపి, డాంగ్; ఛోటౌదేపూర్ జిల్లాలు తీవ్రస్థాయి వాతావరణ పరిస్థితులకు గురయి అపార నష్టం జరిగింది.



గర్ల్‌ఫ్రెండ్ కదలికలపై నిఘాతోనే టెలిగ్రామ్ సిఇఒ అరెస్టు

పారిస్, ఆగస్టు 26: టెలిగ్రామ్ సిఇఒ పావెల్ దురోవ్ అరెస్టుకు ఆతని స్నేహితురాలే కీలకంగా వ్యవహరించిందా, దురోవ్‌తో ఉన్న ఫోటోలను ఆమె ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాలో పోస్టు చేయడంతో దర్యాప్తు అధికారులకు దురోవ్ ఉన్న లొకేషన్లు క్లియర్‌గా తెలిసిందని, అందువల్లనే ఎయిర్‌పోర్టులోనే దురోవ్‌ను అరెస్టుచేయగలిగారని అనుమానాలువ్యక్తం అవుతున్నాయి. రష్యా మార్క్‌జుకర్ బెర్గ్‌గా పిలిచే దురోవ్ టెలిగ్రామ్‌కు 90 కోట్లమంది యూజర్లు ఉన్నారు. అయితే టెలిగ్రామ్‌లో నేరపూరిత సమాచారం వ్యాప్తిచేస్తున్నారన్న అభియోగాలు నమోదయ్యాయి. ఇపుడు తాజాగా దురోవ్ అరెస్టు సమయంలో ఆతను ఒక్కడే లేడని ఆతని వెంట ఒక మహిళ కూడా ఉందని తేలింది. దురోవ్ గర్ల్‌ఫ్రెండ్‌పైనే నిఘా సంస్థలు ఫోకస్ పెట్టాయని అందువల్లనే దురోవ్ కదలికలు సులువుగా తెలుసుకున్నాయని తెలుస్తోంది. 24 ఏళ్ల జులి వావిలోవా పేరు ఇపుడు ఇంటర్నెట్‌ను షేక్‌చేస్తోంది. క్రిప్టోకోచ్, స్ట్రీమర్ దబాయ్ కేంద్రంగా ఆమె పనిచేస్తోంది. ఆమెకు 20వేలమందికిపైగా ఫాలోవర్లు ఉన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మంజూరుచేస్తే అవి ఇప్పటికీ పనిచేయలేదు

బెంగాల్ సిఎం మమతా లేఖపై కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి స్పందన

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాసిన లేఖపై కేంద్రం వెంటనే స్పందించింది. దేశంలో చోటుచేసుకుంటున్న అత్యాచార సంఘటనలు ప్రస్తావించిన మమతా దీదీకి కేంద్రం తక్షణ స్పందన ఇచ్చింది. బెంగాల్‌కు 123 ఫాస్ట్‌ట్రాక్‌కోర్టులు మంజూరు చేసామని, చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాల కేసులు సత్వర విచారణకు మంజూరుచేస్తే ఇప్పటికీ అనేక కోర్టులు వాటిలో పనిచేయడంలేదని కేంద్రం వివరించింది. కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణదేవి మమతా లేఖపై స్పందించారు. కొత్తగా వచ్చిన భారతీయ న్యాయసంహిత చట్టంలోనే నిందితులకు కఠిన శిక్షలువిధించేవిధంగా వచ్చాయన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులపరంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకం ఒకటి ప్రవేశపెట్టామని 2019 అక్టోబరులోనే ప్రారంభించామన్నారు. మొత్తం 409 పోక్సో ప్రత్యేక కోర్టులు 30 రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో పనిచేస్తున్నా యన్నారు. ఇప్పటివరకూ 2.53 లక్షలకేసులు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ స్కీం కింద పశ్చిమబెంగాల్‌కు 123 కోర్టులు వచ్చాయని, వాటిలో 20 పోక్సో కేసుల విచారణ కోర్టులు న్నాయని, 103 ఎఫ్‌టిఎస్‌సి కోర్టులు కూడా ఉన్నాయన్నారు. అయితే ఈ కోర్టుల్లో ఏ ఒక్కటి కూడా ఇప్పటికీ పనిచేయ డంలేదని మంత్రి గుర్తు చేసారు. ఏడు ఫాస్ట్‌ట్రాక్‌కోర్టులు ప్రారంభిస్తామని బెంగాల్‌ప్రభుత్వం చెప్పిందని మొత్తం 17 ఫాస్ట్‌ట్రాక్‌కోర్టులు మళ్లీ సవరించి మంజూరయితే వీటిలో ఆరు పోక్సో కోర్టులున్నాయన్నారు. ఇప్పటికీ 48,600 అత్యాచారాలు, పోక్సో కేసులు న్నాయని, మిగిలిన 11 ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలిపారు. మిగిలిన 11 కోర్టులప్రారంభించేందుకు బెంగాల్‌ప్రభుత్వం ఎటుంటి చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకా కుండా తృణమూల్‌కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నంబరును కూడా ప్రారంభించలేదని మహిళలు, చిన్నారులనుంచి నేరుగా ఫిర్యాదులకోసం ఏర్పాటుచేసిన హెల్ప్ లైన్ నంబరు బెంగాల్‌లో ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆమెప్రశ్నించారు. 181 మహిళా హెల్ప్‌లైన్, అత్యవసర స్పందన వ్యవస్థ 112, ఛైల్డ్‌హెల్ప్‌లైన్ 1098, సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ 1930వంటివి కేంద్రంఏర్పాటు చేసిందని, బెంగాల్‌లో వీటిని ఏర్పాటు చేసారా అని ప్రశ్నించారు. మహిళలు, చిన్నారులపైజరిగే అత్యాచారాలు, దాడులను, హింసను అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం కృతనిశ్చయంతోఉందని, బెంగాల్ ప్రభుత్వం కలిసి రావాలని ఆమె కోరారు.

పొత్తుల్లో తకరారు..కాశ్మీర్‌కు కాంగ్రెస్ ట్రబుల్ షూటర్లు..

శ్రీనగర్, ఆగస్టు 26: అసెంబ్లీ ఎన్నికలకు కేంద్రపాలితప్రాంతం జమ్ముకాశ్మీర్ సిద్ధం అవుతోంది. ఈక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లమధ్య పొత్తులు కుదిరాయి. అయితే సీట్ల పంపకాలపై ఇరుపార్టీల్లో చర్చలవేళ విభేదాలు వచ్చాయి. అభ్యర్థులను ప్రకటించే సమయం సమీపిస్తున్న తరుణంలో ఈసమస్య పరిష్కరించేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలోనే పార్టీలోని ఇద్దరు సీనియర్ నాయకులను ట్రబుల్ షూటర్లుగా శ్రీనగర్‌కు పంపించింది. ఎన్సీ నాయకుడు ఫరూక్ అబ్దుల్లా కాంగ్రెస్‌తో పొత్తుకు అంగీకరించిన సంగతి తెలిసిందే. తొలి విడత ఎన్నికల నామినేషన్ల దాఖలుప్రక్రియకు రేపే తుదిగడువు. దీనితో విభేదాలు తొలగించేందుకు హస్తం పార్టీ సీనియర్ నాయకులు కెసి వేణుగోపాల్, సల్మాన్ ఖుర్షీద్‌లను శ్రీనగర్‌కు పంపించింది. ఫరూక్ అబ్దుల్లాతోపాటు ఆయన కుమారుడు ఓమర్ అబ్దుల్లాతో భేటీ కానున్నట్లు సమాచారం. ఇటీవల రెండు పార్టీల సమావేశంలో కశ్మీర్‌లోయలో కాంగ్రెస్‌కు ఐదు స్థానాలు జమ్ముకామ్మీర్‌లో 28 నుంచి 30 సీట్లలో పోటీచేయాలనిఎన్సీ ప్రతిపాదించింది. అయితే దీనిపై అభ్యంతరం వ్యక్తంచేసిన కాంగ్రెస్ మరికొన్ని స్థానాలు కావాలని డిమాండ్ చేసింది. దీనితో ఈ అంశం ఇరుపార్టీలమధ్య విభేదాలకు కారణం అయింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.30436.95 కోట్లతో డిపిఆర్‌ను కేంద్రం ఆమోదించే అవకాశం!

విజయవాడ ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.30436.95 కోట్లతో డీపీఆర్‌సిద్ధమైంది.ఏపీ ప్రభుత్వం పోలవం ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని భావిస్తోంది.ఇందుకోసం కేంద్రం సహకారంతో పోలవరం ప్రాజెక్టు వద్ద డిజైన్ మార్చి నూతన దయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చేపట్టాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల డిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై ప్రత్యేకంగా శ్రద్ద తీసుకున్నారు.ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు.కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించారు. పోలవరం తొలి దశకు అవసరమయ్యే పూర్తి నిధులను అంచనా వేసి ఈ డీపీఆర్‌ను రూపొందించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కేంద్ర జలసంఘం సాంకేతిక సలహామండలి రివైజ్డ్ కాస్ట్ కమిటీ, పెట్టుబడుల అనుమతి మండలి ఈ మొత్తానికి ఆమోదముద్ర వేశాయి. ఇక కేంద్ర మంత్రిమండలి ఆమోదిస్తే నిధుల విడుదలకు ఆస్కారం ఉంటుంది.కేంద్ర మంత్రిమండలి వచ్చేవారం ఆమోదించే అవకాశం ఉంది .ఈ నెల 27,28 తేదీల్లో కేంద్ర మంత్రిమండలి సమావేశం ఉంది. ఇప్పటికే అన్ని స్థాయులు దాటిన పోలవరం డీపీఆర్ మంత్రి మండలి ఆమోదం కోసం ఎదురుచూస్తోంది పీఎంఓ ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ఈ ప్రతిపాదనను మంత్రిమండలి ముందు ఉంచుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయం తీసుకువెళ్లారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ మాట్లాడారు. తదుపరి కేంద్ర మంత్రిమండలి ముందుకు ఈ ప్రతిపాదన వెళ్లనున్నట్లు రాష్ట్ర అధికారులకు వర్తమానం అందింది. తాజా డీపీఆర్ ఆమెదం పొందితే పోలవరానికి రూ.12157.53 కోట్లు అందుబాటులోకి వస్తాయి. మిగిలిన మొత్తం ఇప్పటికే రీయింబర్స్ చేసినందున ఆ నిధులు అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆ మొత్తం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఎలాగూ కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా ఈ నిధులు ఇవ్వడం లేదు. 2016 తర్వాత నాబార్డుతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుని వారినుంచి కేంద్రం రుణం రూపంలో పొంది రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తోంది. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వబోయే రూ.12వేల కోట్లకు పైగా నిధులను అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరుతున్నారు. ఆ నిధులు వస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రం తొలుత ఖర్చుచేస్తే ఆనక కేంద్రం రీయింబర్స్ చేస్తోంది. నిజానికి జాతీయ ప్రాజెక్టుల్లో కేంద్రమే తొలుత అడ్వాన్స్‌గా నిధులివ్వాలని గతంలో జలవనరులశాఖ ఉన్నతాధికారులుగా పనిచేసిన వారు కూడా పోలవరం అథారిటీ ముందు ప్రస్తావిస్తూ వచ్చారు. మొత్తం మీద బుధ, గురువారాల్లో జరిగే కేంద్రమండలి సమావేశంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.30436.95 కోట్లతో డీపీఆర్‌కు ఆమోదం లభించే అవకాశ ముందనే ఆశాభావంతో ఏపీ ప్రభుత్వం ఉంది.

ప్రతిష్టాత్మకంగా దులీప్‌ట్రోఫీ నిర్వహించాలి

- లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలి: కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ డా.వినోద్‌కుమార్

అనంతపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త బ్యూరో నగరంఒలని ఆర్డిటి స్పోర్ట్స్ విలేజ్‌లో నిర్వహించే దులీప్ ట్రోఫీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోనిమినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డిటి స్పోర్ట్స్ విలేజ్‌లో నిర్వహించే దులీప్ ట్రోఫీపై ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్, ఆర్డిటి, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో మొట్టమొదటిసారి నిర్వహించే దులీప్ ట్రోఫీ కోసం జిల్లా యంత్రాంగం తరపున అన్ని రకాల సహకారం అందించాలన్నారు. అనంతపురం క్రికెట్ అసోషియేషన్ జిల్లా సెక్రెటరీ మధు ఆచారి, ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5వ తేది నుంచి 22వ తేది వరకు నిర్వహఇంచే దులీప్‌ట్రోఫీ భారత క్రికెట్ జట్టు క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని, ఇందుకు లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్డిటి స్పోర్ట్స్ విలేజ్‌కి నిరంతరాయంగా విద్యుత్ సఫరా చేయాలని 160కెవి ట్రాన్స్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేయాలని, దాని నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఫైర్ సేఫ్టీ, డిజాస్టర్ రెస్పాన్స్ మెకానిజం పాటించాలన్నారు. క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో మెడికల్ అరేంజ్‌మెంట్స్ చేయాలని, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, పిహెచ్ సిబ్బందిని నియమించాలని సూచించారు. క్రికెట్ పోటీలను చూసేందుకు బిసిసిఐ సెలక్టర్ అజిత్ అగార్కర్, కామెంటేటర్లు, క్రీడాకారులు రావడం జరుగుతుందని, విఐపి జాబితాను సిద్ధం చేయాలన్నారు. మ్యాచ్‌లను సజావుగా నిర్వహించేందుకు డిఎస్డిఒ పరిధఇలోని కోచ్‌లను, వాలెంటీర్లుగా ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ క్లియరెన్స్ ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని, సెక్యూరిటీ ప్లాన్ పరిశీలించాలని డిఎస్పీని ఆదేశించారు. దులీప్ ట్రోఫీ ఏర్పాట్లను తహశీల్దార్, ఎంపిడిఒ, ఏఈ మున్సిపల్ కమిషనర్, డివిజన్‌స్థాయి అధికారులు, జాయింట్ కలెక్టర్ తదితరులు రోజువారీగా ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. క్రికెటర్లు ఉండే హోటల్స్ వద్ద పోలీస్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డిటి స్టేడియాల్లోని గ్యాలరీల క్లీనింగ్ ఎప్పటికప్పుడు చేపట్టాలని, పబ్లిక్ పార్కింగ్ ఏర్పాటు జాగ్రత్తగా చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు రొటేషన్ పద్ధతిలో పాసులు అందించాలన్నారు. నాలుగు రోజులు జరిగే క్రికెట్ మ్యాచ్ కోసం 4వేల కెపాసిటీ కలిగిన ఆర్డిటి స్టేడియంలో రోజువారీగా పాసులను ఉచితంగా అందించడం జరుగుతుందని, ఎంట్రీ ఉచితంగానే ఉన్నా పాసు ఉంటేనే అనుమతించాలని ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ అధికారులు తెలిపారు. అయితే క్రౌడ్ మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఆదిత్య వర్మ, మున్సిపల్ కమిషనర్ పివివిఎస్ మూర్తి, గుంతకల్లు ఆర్డిఒ శ్రీనివాసులురెడ్డి, ఏపిఎస్పీడిసిఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డిఎస్డిఒ రఫి, డిఎంహెచ్ఓ డాక్టర్ ఇవి.దేవి, డీఈఓ వరలక్ష్మి, డిఎస్పీ ప్రతాప్‌కుమార్, రంజీ క్రికెట్ షాబుద్దీన్, కోచ్ యుగంధర్ తదితరులు

రైల్వే పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల ఫలితాల విడుదల

గుంతకల్లు రైల్వే, ఆగస్టు 27 ప్రభాతవార్త రాష్ట్రంలోని గుంతకల్లులోని దక్షిణ మ ధ్య రైల్వే ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుల నియామకానికై నిర్వహించిన మౌఖిక పరీక్షా ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. తెలుగు, మ్యాథ్స్, సోషల్ సజెక్టులకు సంబంధించి ఖాళీగా ఉన్న ఒక్కొక్క టిజిటి ఉపాధ్యాయుల భర్తీకై ఈ నెల 20న ఇంటర్వ్యూలను నిర్వహించారు. తెలుగు సబ్జెక్టుకు 17 మంది, మ్యాథ్స్-12 మంది, సోషల్ సబ్జెక్టుకు ఆరుగురుచొప్పున మొత్తం 35 మంది అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించి వీరిలో అత్యుత్తమ ప్రతిభ, సామర్థ్యాలు కనబర్చిన అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా తెలుగు సబ్జెక్టుకు హరిజన ఓబులపతి, మ్యాథ్స్ సబ్జెక్టుకు ఎం.కె. శ్రీనివాసులు, సోషల్ సబ్జెక్టుకు సి.హరి నారాయణలను ఎంపిక చేశారు.

బ్రహ్మోత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్

కాణిపాకం,ఆగస్టు 27, ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కాణిపాకం దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, జిల్లా ఎస్పీ మణికంఠచందోలు, ఆలయ ఈఓ కె.వాణిలతో కలసి వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో మంగళవారం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో సెప్టెంబర్ 7 నుండి 27 వరకు 21 రోజుల పాటు ప్రతిష్టా త్మకంగా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బి, విద్యుత్, ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ, అగ్ని మాపకశాఖ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.

గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ పనితీరును సమీక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- స్వయం సహాయక సంఘాలను స్వయం ఉత్పత్తి కేంద్రాలుగా మార్చాలని అధికారులకు సూచన

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సచివాలయం,ఆగస్టు 27,ప్రభాతవార్త : ప్రజల జీవన ప్రమాణాలు, జీవనోపాధి అవకాశాల పెంపుకోసం మెరుగైన ఫలితాలు సాధించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామీణ పేదరిక నిరూ ్మలన శాఖ అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు,గ్రామీణ పేదరిక నిరూ ్మలన,ప్రవాసాంధ్రుల సాధికారత మరియు సంబంధాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన చాంబర్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ పనితీరును అధికారులతో మంత్రి మంగళవారం సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలను స్వయం ఉత ్పత్తి కేంద్రాలుగా మార్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.నూతన ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 100రోజుల్లో సాధించాల్సిన ప్రగతి అందులో ఏ మేరకు ఫలితాలు సాధించారనేదానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖలో ప్రస్తుతం కొనసాగుతున్న పథకాల అమలు,భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.90లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో 55లక్షల మంది లక్ష కన్నా అదనపు ఆదాయం కలిగి ఉన్నారని,మిగిలిన 35లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్ష కన్నా ఎక్కువ ఆదాయం సాధించేందుకు లక్పతి స్కీం కింద అభివృద్ధి లోకి తీసుకురావాలని ఆయన సూచించారు.స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ఇప్పుడు 144రకాల ఉత్పత్తులను 98గ్రూపుల వారు తయారుచేస్తున్నారని వారి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు.రాష్ట్రస్థాయిలో 10స్వయం సహాయక సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాయికి తీసుకెళ్ళాలని,మరో 100సహాయక సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను సూక్ష్మ చిన్న పరిశ్రమల స్థాయిలోనికి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదరి ్శ శశిభూషణ కుమార్,సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్,పలువురు సెర్ప్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనితను కలిసిన సుగాలి ప్రీతి తల్లి

విజయవాడ ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడేళ్ల కిందట కర్నూలులోని ఓ ప్రైవేటు స్కూల్లో సుగాలి ప్రీని అనే విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకున్న స్థితిలో విగతజీవురాలిగా దర్శనమిచ్చింది. సుగాలి ప్రీతి ఉరేసుకుని చనిపోయిందని స్కూల్ యాజమాన్యం పేర్కొనగా స్కూల్ కరస్పాండెంట్ కుమారులు అత్యాచారం చేసి చంపేశారని బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ కేసు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సుగాలి ప్రీతి వ్యవహారంపై పలుమార్లు ఆవేధన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకివస్తే తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు . ఈ నేపథ్యంలో సుగాలి, ప్రీతి తల్లి పార్వతదేవి నేడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ హోంమంత్రి అనితను కలిశారు. తమ కుమార్తెకు జరిగిన అన్యాయం పట్ల వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ న్యాయం కోసం ఏడేళ్లుగా తిరుగుతున్నామని ఆమె ఆక్రోశించారు. పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీతో న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందని అన్నారు. సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు గత ప్రభుత్వం జీవో ఇచ్చిందని పార్వతీదేవి వెల్లడించారు. సీబీఐ విచారన ప్రారంభం కాకపోవడంతో డిల్లీ కూడా వెళ్లామని తెలిపారు. ఆ జీవో టిష్యూ పేపర్‌తో సమానమని అదికారులు చెప్పడం తమను మరింత కుంగిపోయేలా చేసిందని వాపోయారు.గత ప్రభుత్వం ఫేక్ జీవోలతో తమను మోసం చేసిందని అన్నారు.

సీఎస్‌గాపనిచేసిన జవహర్ రెడ్డి కూడా తమకు అన్యాయం చేశారని పార్వతీదేవి వ్యాఖ్యానించారు.

తాజాగా, ఈ కేసును సీఐడీకి అప్పగిస్తామని హోంమంత్రి అనిత చెప్పారని ఈ కేసును సీఐడీ చీఫ్ రవిశంకర్ స్వయంగా విచారిస్తారని హామీ ఇచ్చారని వివరించారు.

సెంట్రల్ యూనివర్సిటీకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాం:కలెక్టర్

అనంతపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త బ్యూరో సెంట్రల్ యూనివర్సిటీకి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ డా.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండలంలోని జంతులూరు వద్ద నున్న ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సెంట్రల్ యూనివర్సిటీ ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సెంట్రల్ యనివర్సిటీ ఏర్పాటు చేయడం పట్ల గర్వంగా ఉందని, యూనివర్సిటీ అభివృద్ధి కసం అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం నుంచి అందిస్తామన్నారు. అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి సెంట్రల్‌యూనివర్సిటీ వేసిన అప్రోచ్ రోడ్‌లో 120 మీటర్ల గ్యాప్‌దానిని ఉందని, దానిని వెంటనే పూర్తి చయేలని అధికారులను ఆదేశించారు. సెంట్రల్ యూనివర్సిటీ కాంపౌండ్ వాల్‌కు సంబంధించి 7.85 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పిటివ రకు 2.98 కోట్ల రూపాయలు ఖర్చుతో 4.69 కిలోమీటర్ల కాంపౌండ్‌వాల్ పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన 3.16 కిలోమీటర్ల కాంపౌండ్ వాల్‌ను మెటీరియల్ తీసుకువచ్చి 7 రోజుల్లో పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. యూనివర్సిటీకి తాగునీటి సరఫరాకు సంబంధించి మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. 33.11 కెవి సబ్ స్టేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సెంట్రల్ యూనివర్సిటీ ఆవరణంలో మొక్కను నాటారు. సెంట్రల్ యూనివర్సిటీ డీన్ సన్ కోరి, పంచాయితీ రాజ్ఎ స్ఈ కెవికెవి ప్రసాద్, హెచ్ఎల్‌సిఎస్ఈ రాజశేఖర్, సెంట్రల్ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొ.హనుమాన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

నీతిఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యంకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

దుర్గమ్మ సేవలో నీతిఆయోగ్ సిఇఒ

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 27, ప్రభాత'వార్త' : దుర్గమ్మను మంగళవారం నీతిఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణం మంగళవారం దర్శించుకున్నారు. ఆయన దుర్గమ్మకు జరిగే పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ డిప్యూటి ఇఓ లీలాకుమార్ దుర్గమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

పారిశ్రామిక రంగంలో రాణించాలనుకునే యువతకు ప్రభుత్వం చేయూత

విజయవాడ ఆగస్టు 27 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక రంగంలో రాణించాలనుకునే యువతకు ప్రభుత్వం చేయూతను అందిస్తోంది, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు వారికి చేయూత అందించేందుకు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకుకార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం హైదరాబాద్‌లోని జాతీయ సూక్ష్మ , చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థతో ఆంధ్రాలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అమలుకు సంబందించి ఇప్పటికే ఎన్ఐఎంఎస్‌ఎంఇ సంస్థతో ఆయాశాఖల అధికారులు చర్చలు జరుపుతున్నారు. అభ్యర్థులకు అయ్యే ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. ఏటా 2000ల మందిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేశారు. ప్రతి సంవత్సరం 2000 ల మందిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా అధికారులు ప్రతిపాదనలు రెడీ చేశారు. ఇందులో 1000 మంది బీసీలు, కాపు సామాజిక వర్గం నుంచి 500 మంది. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన 500 మంది ఉండనున్నారు. ఈ వర్గాల నుంచి ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఎంపిక చేసి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈడీపీ కార్యక్రమం ఏడాది పొడవునా కొనసాగేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

4 లేదా 6 వారాలు ట్రైనింగ్ ఇచ్చే చాన్స్ ఉంది. ట్రైనింగ్ ఎంపిక చేసేందుకు ప్రత్యేకమైన పద్దతి అవలింభించబోతున్నారు.

ఈ ఐదేళ్లలో 9000 ల మందిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేలా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఎన్ఐఎంఎస్ఎంఇ లో శిక్షణతర్వాత వారి ఆసక్తికి అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకూ ప్రభుత్వం సాయం చేస్తుంది. ఈ డీపీ కార్యక్రమం ద్వారా ట్రైనింగ్ కంప్లీట్ చేసుకున్న వారు తమ లోచనలను సదరు సంస్థతో నిరంతరం పంచుకునే అవకాశం లభిస్తోంది.

దళితులను ఎబిసిడిలుగా విభజించి పాలించొద్దు :మాజీ మంత్రి చింతామోహన్

కుప్పంలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి చింతామోహన్

కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త దళితులను ఎ,బి,సి,డి.లుగా విభజించి పాలించవద్దని కే ంద్రమాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీతో చర్చించి ఎబిసిడి వర్గీకరణ పక్కకు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇదివరకే బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల విషయంలో షేక్ హసీనా చేయిపెట్టి కాల్చుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో దళిత ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దళిత అధికారిని తమిళనాడులో లాగా ఇక్కడ కూడా చీఫ్ సెక్రటరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలలో ఎంతమంది దళిత అధికారులు ఉన్నారని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో 500రూ.ల టికెట్లను కొంతమంది పెద్దలు బ్లాక్‌లో లక్షల సంఖ్యలో విక్రయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ తంతు ఐదేళ్లుగా కొనసాగుతోందని సిఎం చంద్రబాబు స్పందించి వెంటనే బ్లాక్ టికెట్ల వ్యవహారాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు. టిటిడి ఇంజనీరింగ్ శాఖలో పలు ఫైల్స్ కాలిపోయాయని ఇందులో వందల కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. కుప్పంలోని ద్రవిడ వర్సిటీ పరిస్థితి అధ్వాన్నంగా మారిందని పేర్కొన్నారు. ఇక్కడ తాత్కాలిక ఉద్యోగులకు 13నెలలుగా వేతనాలు లేకపోవడ ం దారుణమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు స్పందించి వారంలోగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబు పరిశ్రమలు ఏర్పాటుచేయించి ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో నేతలు ఆవులగోపి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి 200 మెగావాట్ల విద్యుత్

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: తెలంగాణలో ఏటా 200 మెగావాట్ల సోలార్ ఎనర్జీ అందించేలా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ముందుకొచ్చింది. కేంద్రం తీసుకొచ్చిన ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆడిఎ) పథకంలో భాగంగా 510 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గుజరాత్‌లో ఏర్పాటు చేస్తోంది. దాదాపు 1,214 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు పూర్తికావచ్చాయి. వచ్చే ఏడాది జూన్ నుండి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకంగా మారనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కిలోవాట్ పర్ అవర్‌కు 2.57 రూపాయలకు విద్యుత్ అందుబాటులోకి రానుంది. తద్వారా వచ్చే 25 ఏళ్లలో దాదాపు 2 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ట్రాన్స్కోకు ఆదా అవుతుందని అంచనా. అంతేకాకుండా ఎస్‌జిఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి ఆదాయం సమకూరనుంది. మరోపక్క ఈ సోలార్ రపాజెక్టు జీవిత కాలంలో సరఫరా చేసే 12.5 బిలియన్ యూనిట్ల గ్రీన్ ఎనర్జీ ద్వారా 8.9 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను అడ్డుకోవచ్చని లెక్క కడుతున్నారు.

బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త: మద్యం కేసులో నిందితురాలు ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ బిజెపి బిఆర్ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్ వచ్చిందని నిందించారు. మరో టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి బిఆర్ఎస్ బిజెపి చీకటి ఒప్పందం కవిత బెయిల్ అంటూ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నాయ కులు కవిత బెయిల్‌పై బిఆర్ఎస్‌ను విమర్శిస్తూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వారి మాటల్లోనే ..

బిజెపిలో బిఆర్ఎస్ విలీనప్రక్రియ ఆరంభం : మహేశ్‌కుమార్‌గౌడ్

బిజెపిలో బిఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలైంది. కవిత బెయిల్ ఊహించిందే. బిజెపి, బిఆర్ఎస్ చీకటి ఒప్పందంతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ బిజెపికి దాసోహమైంది. బిఆర్ఎస్ బిజెపి కుమ్మక్కైతోనే కవితకు బెయిల్ వచ్చింది. హరీశ్, కెటిఆర్‌లు ఢిల్లీలో బిజెపి నేతల చుట్టు ఆపద మొక్కులు మొక్కారు. బిజెపి నేతల ఇళ్ళచుట్టు తిరిగి కాళ్లమీదపడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారు. బిజెపి బిఆర్ఎస్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు అర్థంచేసుకోవాలి.

కెసిఆర్‌కు మోడీ ఇచ్చిన రిటర్న్‌గిఫ్ట్: జగ్గారెడ్డి

లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి ఎనిమిది ఎంపి స్థానాలు గెలిచేందుకు సహకరించినందుకు కెసిఆర్‌కు కవిత బెయిల్ రూపంలో మోడీ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిండు. కవిత కోసం సొంత పార్లమెంట్ నియోజకవర్గం కెసిఆర్ వదిలేసుకున్నారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను బలహీన పరిచే ఒప్పందంలో భాగంగానే బిజెపి బిఆర్ఎస్ ఎత్తుగడ ఇది. బిఆర్ఎస్ బిజెపి కలిసిపోవడంతో మాకు నాలుగు సీట్లు తగ్గాయి. బిజెపి ఉత్తరాదిన వీక్ అయ్యింది.దక్షిణాన బిఆర్ఎస్ బలహీనపరిచి బిజెపిని బలోపేతం చేసింది. బిఆర్ఎస్ బిజెపికి పావుగా పనిచేస్తుంది. జడ్జి బెయిల్ ఇవ్వకముందే మూడు రోజుల నుంచి కవితకు బెయిల్ వస్తుందని బిఆర్ఎస్ సోషల్‌మీడియా ప్రచారం చేసిందంటే ఇది నిజంగా బిజెపి బిఆర్ఎస్ చీకటి ఒప్పొందమే. బిఆర్ఎస్‌కు మంచి రోజులు బిజెపి వల్ల వచ్చింది. జడ్జిచెప్పక ముందే బెయిల్ వస్తదని ఎలా వీళ్ళకు తెలిసింది. మేం జడ్జీని తప్పుపట్టడంలేదు. న్యాయవ్యవస్థ కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవాలి. సిసోడియాకు కెజ్రివాల్‌కు బెయిల్ ఇవ్వడానికి ఆలోచించిన కోర్టులు కవితకు ఐదు నెలలలో బెయిల్ వచ్చిందంటేనే బిజెపి బిఆర్ఎస్ చీకటి ఒప్పందం తెలుపుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది అందుకే బిజెపి ఇక బిఆర్ఎస్‌ను కలుపుకొనాలనుకుంటుంది. లిక్కర్ కేసులో అరెస్టై తెలంగాణ రాష్ట్ర మహిళ గౌరవం తగ్గించింది కవిత. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అందరు ఢిల్లీకి వెళ్ళిబిజెపి నేతలతో కాళ్ళబేరం చేసి బెయిల్ తెచ్చుకున్నారు.

మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో భద్రత పెంపు

కోల్‌కతా ఘటన నేపథ్యంలో ప్రత్యేక సిబ్బంది నియామకం

హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త : కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్య ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులలో భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించింది. డిజిపి ఆదేశాలతో వైద్యుల భద్రతకు భరోసా కల్పించే విధంగా విజువల్ పోలీసింగ్‌కు చర్యలు చేపట్టారు. ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆసుపత్రులతో పాటు ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతీ రోజు పెద్ద సంఖ్యలో రోగులు, సహాయకులు వస్తుంటారు. జూనియర్ డాక్టర్లపై ఎలాంటి దాడులకు అవకాశం లేకుండా ముందు జాగ్రత్తగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్లు, ఎస్పీలకు డిజిపి కార్యాలయ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఆసుపత్రులు, కాలేజీల వద్ద తప్పనిసరిగా గస్తీలో ఉండే పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

బెంగాల్‌లో మళ్లీ పెల్లుబికిన ఆందోళనలు

హత్యాచార ఘటనపై విద్యార్థుల నిరసన వెల్లువ: కోలకతాలో బారికేడ్లను బద్దలుకొట్టి దూసుకు వెళ్లిన ఆందోళన కారులు

కోల్‌కతా, ఆగస్టు 27: పశ్చిమబెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలంటూ విద్యార్థి సంఘం పశ్చిమ బంగా ఛారనరత సమాజ్ మంగళవారం నిరసన చేపట్టింది. నబన్నా అభియాన్ పేరుతో హావ్‌డా నుంచి విద్యార్థులు ర్యాలీని ప్రారంభించారు. అయితే వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హావ్‌డాలోని సంతర్‌గాచి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్చ్‌లో పాల్గొన్న ఆందోళనకారులు బారికేడ్లను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించారు. కొన్నింటిని లాగి పడేశారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వీరిపై బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జి చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ర్యాలీ నేపథ్యంలో సిఎం మమతా నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆందోళన

నిర్వహించేందుకు అనుమతి కోరుతూ ఎలాంటి అభ్యర్థన రాలేదని పోలీసులు తెలిపారు. అలాగే ఈ మార్చ్ జరిగే సమయంలో హింసకు పాల్పడేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో అదృశ్యమయ్యారని బిజెపి నేత సువేందు అధికారి ఆరోపించారు. విద్యార్థులు మిస్ అయ్యారంటూ కొందరు రాజకీయ నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని బెంగాల్ పోలీసులు ఎక్స్ వేదికగా స్పందించారు. ఎవరూ అదృశ్యం కాలేదన్నది నిజమని తెలిపారు. దీనికిసువేంద్ బదులిస్తూ ఆ విద్యార్థుల కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. మమతా పోలీస్ కోర్టులో కలుద్దాం అంటూ పోస్టు పెట్టారు. ఈ ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కోల్‌కతా పోలీసు విభాగం 6 వేల మందిని మోహరించింది. అలాగే ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 26 జిల్లాల కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించింది. హేస్టింగ్స్‌లోని ఫోర్ట్ విలియం గేట్లకు సివిక్ వాలంటీర్లు గ్రీజ్ పూసిన దృశ్యాలు మీడియాలో వెలుగులోకి వచ్చాయి. నిరసనకారుల్ని అడ్డుకునేందుకు అధికారులు ఈ విధంగా చేశారు. ఈ మార్చ్ నేపథ్యంలో ప్రజాజీవితానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. నబన్నా ర్యాలీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపితమని వామపక్ష నాయకురాలు బృందాకారత్ తీవ్ర విమర్శలు చేశారు.

బెంగాల్ రాజకీయాలను కుదిపేస్తున్న 'హత్యాచారం'

కోల్‌కతా, ఆగస్టు 27: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఘటనలోనిందితుడికి కఠిన శిక్ష పడాలంటూ గత కొంతకాలంగా వైద్య విద్యార్థులు, పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా మంగళవారం మరోసారి తీవ్ర నిరసనలు చోటు చేసుకున్నాయి. అయితే, ఈ ఆందోళనలకు నాయకత్వం వహిస్తోంది పశ్చిమబంగ ఛాత్ర సమాజ్ అనే ఓ కొత్త స్టూడెంట్ యూనియన్. దీంతో ఈ పేరు ఇప్పుడు మార్మోగుతోంది. పశ్చిమబంగ ఛాత్ర సమాజ్ అనేది రికార్డుల్లో నమోదు కాని విద్యార్థి సంఘం. గత కొన్ని వారాల కింద తెరపైకి వచ్చింది. రవీంద్ర భారతి యూనివర్సిటీ మాస్టర్స్ విద్యార్థి ప్రబీర్ దాస్, కల్యాణి యూనివర్సిటీకి చెందిన శుభాంకర్ హల్దార్, రవీంద్ర ముక్త యూనివర్సిటీ విద్యార్థి సయన్ లాహిరి కలిసి నబన్నా అభియాన్ పేరుతో ఆందోళనలకు నేతృత్వం వహిస్తున్నారు. ఎలాంటి రాజకీయ పార్టీతో తమకు సంబంధం లేదని, కేవలం న్యాయం కోసం మాత్రమే తాము ఈ ఆందోళనకు పిలుపునిచ్చామని నిర్వాహకులు అంటున్నారు. ఈ సందర్భంగా మూడు డిమాండ్లను వినిపించారు. బాధితురాలికి న్యాయం జరగాలని, నిందితుడికి మరణశిక్ష విధించాలని, సిఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య విషయం ఏమిటంటే హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు నబన్నా మార్చ్‌కు దూరంగా ఉండటం గమనార్హం. ఛాత్ర సమాజ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించిన జూనియర్ వైద్యులు బుధవారం కోల్‌కతాలో ర్యాలీకి పిలుపునిచ్చారు. మరోవైపు ఈ విద్యార్థి సంఘం ఆందోళనలకు బిజెపి వెలుపలి మద్దతు ఇవ్వగా వామపక్షాలు దూరంగా ఉన్నాయి. ఇతర విద్యార్థి సంఘాలు కూడా వీరికి ఎలాంటి మద్దతు ప్రకటించలేదు. ఛాత్ర సమాజ్ ఆందోళన నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ర్యాలీకి ముందుగానే భద్రతను కట్టుదిట్టం చేసింది. ఈ మార్చ్‌కు ఎలాంటి అనుమతి లేదని చెబుతున్న పోలీసులు 6 వేల మందితో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఛాత్ర సమాజ్ ఆందోళనకు దిగింది.

ఈ మధ్యాహ్నం హావ్‌డా వంతెన వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు యత్నించారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. లాఠీఛార్జి చేసి, భాష్పవాయువు ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొడుతున్నారు. ఈ క్రమంలోనే ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

బిఎస్పీ జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవం

లక్నో, ఆగస్టు 27: బహుజన్‌సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడుగా మామావతి ఏకగ్రీవంగా మళ్లీ ఎన్నికయ్యారు. బిఎస్‌పి కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ప్రత్యేక సమావేశంలో ఈనిర్ణయం జరిగిందని పార్టీ నేతలు తెలిపారు. సీనియర్ జాతీయ కమిటీ సభ్యులు, రాష్ట్రపార్టీయూనిట్లు, పార్టీప్రతినిధులు మాయావతిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ దేశవ్యాప్తంగా తమతమ ఏకాభిప్రాయాన్ని తెలిపారని పార్టీ ప్రకటన విడుదల చేసింది. 68ఏళ్ల మాయావతి ఉత్తర ప్రదేశ్‌కు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగాపనిచేసారు. బిఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీరామ్ మాయావతిని తన రాజకీయ వారసురాలిగా రెండుదశాబ్దాల క్రితమే ప్రకటించారు.

'అమ్మ'కు మోహన్ లాల్ రాజీనామా

తిరువనంతపురం, ఆగస్టు 27: మళయాళం చలనచిత్ర నటీనటుల సంఘానికి అధ్యక్షుడుగా కొనసాగుతున్న మోహన్‌లాల్ తన పదవికి రాజీనామాచేసారు. అమ్మగా పిలిచే ఈ అసోసియేషన్‌లో అధ్యక్షుడుగా కొనసాగుతున్న మోహన్‌లాల్ కొందరు మాలివుడ్ పెద్దప్రముఖలపై అత్యాచారం ఆరోపణలు రావడంతో ప్రముఖులు కొందరు ఇప్పటికే తప్పుకోగా అధ్యక్ష పదవిలో కొనసాగడానికి సుముఖత వ్యక్తం చేయని మోహనల్‌లాల్ రాజీనామా చేసారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో నిర్మాత రంజిత్ బాలకృష్ణన్, నటుడు సిద్ధికీ కూడా ఉన్నారు. మొత్తం కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కూడా రాజీనామాలు చేసారు. అనంతరం అమ్మ ఒక ప్రకటన విడుదలచేసింది. నైతిక బాధ్యత వహిస్తూ అసోసియేషన్‌ను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. కమిటీలో కొందరిపైనా ఆరోపణలు రావడంతో నైతికబాధ్యతగా మొత్తం

కమిటీ సభ్యులు రాజీనామాలు సమర్పించారు. జస్టిస్ హేమ కమిటీ నివేదిక బహిర్గతం కావడంతో మాలివుడ్ పరిశ్రమ ప్రతిష్ట మసకబారింది. పరిశ్రమలో మహిళా సాంకేతిక సిబ్బంది, నటులు ఎదుర్కొంటున్న అవమానాలతో సుదీర్ఘ నివేదికను అందించారు. 2019లో ఈ కమిటీ నివేదిక ఇచ్చినా ఇప్పటివరకూ వెలుగులోకి రాలేదు. న్యాయపరమైన సవాళ్లను అధిగమించి తాజాగా ప్రభుత్వం విడుదలచేసింది. నటుడు బాబూరాజ్‌తో సహా అనేకమంది మళయాళం నటులపై వచ్చిన ఆరోపణలతో వారంతా కూడా రాజీనామాలుచేసారు. అమ్మకు బాబూరాజ్ కార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం రంజిత్ బాలకృష్ణన్, సిద్ధిఖీ, బాబూరాజ్‌ల తోపాటు మరో నటి మిను మునీర్‌కూడా ఎం ముకేష్, జయసూర్య వంటి మరో ఇద్దరుప్రముఖ నటులపై ఆరోపణలు చేసింది. తనపై భౌతికంగాను, అసభ్యకరంగా ప్రవర్తించారని, 2013లో ఒక సినిమా సెట్‌లో తనపట్ల అసభ్యంగా వ్యవహరించినట్లు తెలిపింది. మనియన్‌పిల్లరాజు అనే మరో చలనచిత్ర సంఘం సభ్యుడిపైనా మినూమునీర్ ఇదే ఆరోపణలుచేసారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రత్యేక దర్యాప్తు కమిటీ సిట్‌ను ఏర్పాటుచేసి లైంగిక ఆరోపణలన్నింటిపైనా సమగ్రదర్యాప్తు చేయాలని ఆదేశించారు.

భారత్ బయోటెక్ నుంచి కొత్త కలరా వ్యాక్సిన్

హైదరాబాద్, ఆగస్టు 27: ప్రైవేటురంగ ఔషధ తయారీ కంపెని భారత్ బయోటెక్ మంగళవారం కలరా కొత్త వ్యాక్సిన్‌ను విడుదలచేసింది. హిల్‌చాల్‌గా పేర్కొంటున్న ఈ మౌఖిక వ్యాక్సిన్‌ను విడుదలచేస్తున్నట్లు వెల్లడించింది. హిల్‌చాల్ లేదా బిబివి131ను కంపెనీ అమెరికాలోని మెర్క్, వెల్‌కమ్ ట్రస్టుల సౌజన్యంతో అభివృద్ధిచేసింది. కలరాను తుదముట్టించేందుకు ఈ ఔషధం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా నోటిద్వారా వేసుకునే వ్యాక్సిన్‌కు ఎంతో డిమాండ్ ఉంది. 100 మిలియన్ డోసుల వ్యాక్సిన్ అవసరమని తెలుస్తోంది. అయితే ఆమేరకు ఈ డోసుల కొరత తీవ్రంగా ఉన్నట్లు తేలింది. కేవలం ఒకే ఒక్క తయారీ సంస్థ ఉండటంతో ఈఔషధానికి తీవ్ర కొరత ఏర్పడింది. భారత్‌బయోటెక్ హైదరాబాద్, భువనేశ్వర్‌లలో భారీ స్థాయి ఉత్పత్తి సౌకర్యాలను ఏర్పాటుచేసుకుంది. సాలీనా 200 మిలియన్ డోసుల హిల్‌చాల్ ఔషధం ఉత్పత్తిచేయనున్నట్లుప్రకటించింది. క్లినికల్ అధ్యయనం, బహుళ అంచెల్లో జరిగిన పరీక్షలు మూడోదశ పరీక్షలు వ్యాక్సిన్‌భద్రతను, వ్యాధినిరోధకశక్తిని పెంచుతున్నట్లు ధృవీకరించారు. ప్రస్తుతం ఉన్న నోటిద్వారా వినియోగించే మందులకు ఎంతమాత్రం తగ్గదని ప్రజారోగ్యానికి ఎలాంటి హాని ఉండదని వెల్లడించింది. ఈ వ్యాక్సిన్ సింగిల్ డోస్ వ్యాక్సిన్ అని 14 ఏళ్ల వయసువారి వరకూ ఈ వ్యాక్సిన్ వాడవచ్చుని, మరీ ముఖ్యంగా ఏడాదిపైబడిన పసికందులకు ఈ వ్యాక్సిన్ వేయవచ్చని కంపెనీ వెల్లడించింది.

29 మందితో బిజెపి మూడో జాబితా

శ్రీనగర్, ఆగస్టు 27: జమ్ముకాశ్మీర్ ఎన్నికలకోసం భారతీయ జనతాపార్టీ మంగళవారం మరో 29 మంది అభ్యర్థులతో జాబితానుప్రకటించింది. దీనితో మొత్తం 45 స్థానాలకు బిజెపి జమ్ముకాశ్మీర్‌లో అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ముందురోజే పార్టీ 44 మందిని ప్రకటించినా తర్వాత రద్దుచేసి కేవలం 15 మంది అభ్యర్థులను మాత్రమే తొలివిడత పోలింగ్ జరిగే ఎన్నికల కోసమని ప్రకటించింది. ఆ తర్వాత మరో జాబితాను కేవలం ఒకే ఒక్క పేరుతో విడుదలచేసింది. పార్టీ రెండో విడత ఎన్నికలకోసం పది మంది అభ్యర్థులనుప్రకటించగా మూడోదశ ఎన్నికలకోసం 19 మంది అభ్యర్థులను ప్రకటించింది. రోహిత్ దూబే స్థానంలో ఈసారి బల్‌దేవ్‌రాజ్ శర్మను శ్రీమాతా వైష్ణోదేవి స్థానం నుంచి పోటీకి దించింది. దేవేందర్‌సింగ్ రాణాను నగ్రోటానుంచి సతీష్‌శర్మను బిల్లావర్‌నుంచి

పోటీకి దించింది. మాజీ డిప్యూటి ముఖ్యమంత్రి నిర్మల్ సింగ్ ఈస్థానంనుంచి గత ఎన్నికల్లో పోటీచేసారు. అయితేనౌషేరాకు తన అభ్యర్థిని ఇప్పటికీ ప్రకటించలేదు. 2014లో ఇక్కడ బిజెపి అభ్యర్థి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా ఆనాడు ఈస్థానం నుంచే గెలిచారు. గాంధీనగర్ స్థానంలో సీనియర్ నాయకుడు డిప్యూటి సిఎం కవీందర్ గుప్తా కూడా గత ఎన్నికల్లో గెలిచారు. కాంగ్రెస్; నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు కూడా సోమవారం సీట్ల వాటాలను కూడా ఖరారుచేసుకున్నాయి. జమ్ముకాశ్మీర్‌లో 51స్థానాలకు ఎన్సీ, 32 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీలు పోటీచేయాలని నిర్ణయించాయి. 90మంది సభ్యులున్న జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి మూడుదశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 18, అక్టోబరు ఒకటవ తేదీమధ్యలోమూడు విడతలుగా జరుగుతున్నాయి. అక్టోబరు నాల్గవ తేదీ ఓట్లలెక్కింపు జరుగుతుంది. 2014లో బిజెపి ఆనాడు పిడిపి మెహబూబా ముఫ్తీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. తర్వాత మద్దతును ఉపసంహరించుకుని రాష్ట్రపతి పాలన రావడం ఆపై 370వ అధికరణం రద్దు, రెండు ప్రాంతాలుగా జమ్ముకాశ్మీర్‌ను విభజించింది. అసెంబ్లీతో కూడిన జమ్ముకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగాను, అసెంబ్లీలేని కేంద్రపాలిత ప్రాంతంగా లడక్‌ను ఏర్పాటు చేసింది.

హర్యానాలో జట్టుకట్టిన జేజేపీ, ఆజాద్ సమాజ్ పార్టీలు!

70 సీట్లలో జేజేపీ, 20 స్థానాల్లో ఆజాద్ సమాజ్ పోటీ

చండీగఢ్, ఆగస్టు 27: అసెంబ్లీ ఎన్నికలవేళ హర్యానాలో కొత్త పొత్తులు తెరపైకి వస్తున్నాయి. జన్‌నాయక్ జనతాపార్టీ, చంద్రశేఖర్ ఆజాద్ స్థాపించిన ఆజాద్ సమాజ్‌పార్టీలు మంగళవారం కూటమిగా జట్టుకట్టాయి. 90 అసెంబ్లీ స్థానాలకు పోటీచేయనున్నట్లు ప్రకటించాయి. 90 స్థానాల్లో దుష్యంత్ చౌతాలా జెజెపి 70 స్థానాల్లో పోటీచేయనుండగా ఆజాద్ సమాజ్ పార్టీ మిగిలిన 20 స్థానాల్లో పోటీ చేస్తుంది. జెజెపి చీఫ్ దుష్యంత్ చౌఐతాలా ఈ కూటమి ఏర్పడినట్లు ఆజాద్‌సమాజ్ పార్టీతోకలిసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయనున్నట్లు ఢిల్లీలో ప్రకటించారు. చౌతాలా, చంద్రశేఖర్‌లు ఇద్దరూ

కూడా రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, యువ ప్రభుత్వం ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మాజీ హోంమంత్రి అనిల్‌విజ్ ముందురోజే హర్యానాల్లో జరిగే ఎన్నికల్లో మళ్లీ బిజెపిదే గెలుపు అని ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీని సులువుగా ఓడిం చేస్తామని మంత్రి తెలిపారు. ఎన్నికలకు ముందు నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామాచేసి బిజెపిలో చేరడం జెజెపికి ఒక షాక్ అనే చెప్పాలి. మొత్తం పదిమందిలో ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీని వీడారు. నలుగురు ఎమ్మెల్యేల్లో మాజీ మంత్రి అనేఊప్ ధనక్, దేవేందర్ బబ్లి, రామ్‌కరణ కాలా, ఈశ్వర్‌సింగ్‌లున్నారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు వారు ప్రకటించారు. కేవలం ఇపుడు జెజెపికి ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారు నైనా చౌతాలా అంటే దుష్యంత్ చౌతాలా తల్లి భద్ర స్థానంలో కొనసాగుతున్నారు. దుష్యంత్ కూడా ఎమ్మెల్యేగా ఉఛ్‌నా కలన్‌నుంచి పోటీచేసి గెలిచారు.

కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ సెప్టెంబరు 3వరకూ పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఢిల్లీ లిక్కర్‌పాలసీకి సిబిఐ నమోదుచేసినకేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి ఊపశమనం లభించలేదు. కేజ్రీవాల్ జ్యుడిషియల్‌కస్టడీని సెప్టెంబరు 3వ తేదీవరకూ రౌస్ అవెన్యూకోర్టుప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం పొడిగించారు. అంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితోముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుముందు హాజరుపరిచారు. సిబిఐ దాఖలుచేసిన నాలుగో ఛార్జి షీటుపై నిర్ణయాన్ని కూడా రౌస్‌అవెన్యూ కోర్టు రిజర్వు

చేసింది. ఈ ఛార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదు గురిపేర్లను సిబిఐ చేర్చింది. సెప్టెం బరు 3న దీనిపై కోర్టు విచారణ జరపనున్నది. సిబిఐ ఈడీ దర్యాప్తుచేస్తున్న ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ చీఫ్‌కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. కాగా ఎక్సైజ్‌పాలసీ కేసులో బెయిల్‌కోరుతూ కేజ్రీవాల్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను సెప్టెంబరు ఐదవతేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అఫిడవిట్ సమర్పించేందుకు మరింత గడువు కావాలని సిబిఐ కోరడంతో సుప్రీం నిర్ణయం ప్రకటించింది. తనకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ ఒక పిటిషన్, సిబిఐ తనను అరెస్టుచేయడాన్ని సవాల్ చేస్తూ మరో పిటిషన్‌ను కేజ్రీవాల్ దాఖలుచేసిన సంగతి తెలిసిందే.

జపాన్‌కు తుఫాన్ ముప్పు..
విమానాలు, బుల్లెట్ రైళ్ల రద్దు

టోక్యో, ఆగస్టు 27: టైఫూన్ షాన్‌షాన్ జపాన్‌ను వణికిస్తోంది. దేశంలోని పలుప్రాంతాలు ఈదురు గాలులతో అతలాకుతలమవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా దేశప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. షాన్‌షాన్ ప్రభావంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు విమాన సర్వీసులు, బుల్లెట్ రైళ్లను రద్దు చేసినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం టైఫూన్ షాన్‌షాన్ దక్షిణ అమామి వైపుగా కదులు తున్నట్లు తెలుస్తోంది. గంటకు 216 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. భారీ వర్షాల కారణంగా హమా మత్సు, తోయోహాషి మధ్య బుల్లెట్ రైళ్ల సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. కొన్నిగంటల తర్వాత సేవలను పునరుద్ధరించారు. మరికొన్ని ప్రాంతాల్లో కూడా హైస్పీడ్, లోకల్ రైళ్ల ప్రయాణం ఆలస్యమైనట్లు జపాన్ రైల్వే ప్రకటనలో పేర్కొంది. అనేక విమాన సర్వీసులు, బుల్లెట్ రైళ్ల రాకపోకలను రద్దు చేశారు. రెండు రోజుల వ్యవధిలోనే దేశీయంగా 116 విమాన సర్వీసులను, అంతర్జాతీయంగా ఆరువిమానాలను రద్దు చేసినట్లు జపాన్ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. టైఫూన్ షాన్‌షాన్ కదలికలను బట్టి మరికొన్ని రైళ్ల సర్వీసులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పుతిన్‌కు మోడీ ఫోన్.. ఉక్రెయిన్ పర్యటనపై చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఉక్రెయిన్‌లో ఇటీవల పర్యటించిన ప్రధాని నరేంద్రమోడీ.. చర్చలు, సంప్రదింపులతో వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేసిన ప్రధాని మోడీ.. ఉక్రెయిన్ పర్యటన వివరాలను పంచుకోవడంతోపాటు సంక్షోభానికి ముగింపు పలికే మార్గాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. 'ఇరు దేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం. రష్యా-ఉక్రెయిన్ మధ్య నెలకొన్న వివాదంపై అభిప్రాయాలను పంచుకున్నాం. శాంతియుత మార్గాల్లో సంక్షోభానికి ముగింపు పలకడం, అక్కడ శాంతి-స్థిరత్వం కోసం భారత్ పూర్తి మద్దతు అందిస్తుందని పునరుద్ఘాటించా'

అని ప్రధాని మోడీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. మరోవైపు, ఉక్రెయిన్‌లో ఇటీవల పర్యటించిన ప్రధాని మోడీపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రశంసలు కురిపించారు. తన పర్యటన ద్వారా మోడీ శాంతి సందేశం పంపారని కొనియాడారు. అక్కడ కొనసాగుతున్న మానవతా సాయానికి మద్దతుగా నిలిచారని బైడెన్ వ్యాఖ్యానించారు.

కాశ్మీర్ ఎన్నికలకు నిషేధిత సంస్థ మాజీ సభ్యుల నామినేషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 27: జమ్మూకాశ్మీర్ శాసనసభకు మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలిదశ విడత పోలింగ్‌కు నామినేషన్ దాఖలు చేయడానికి మంగళవారమే చివరిరోజు కావడంతో పలువురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఈ క్రమంలో నిషేధిత సంస్థ 'జమాతే ఇస్లామీ-జమ్మూకాశ్మీర్ (జెఐజెకె)'కు చెందిన పలువురు మాజీ సభ్యులు నామినేషన్ వేసి, ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. సంస్థ మాజీ చీఫ్ తలత్ మాజీద్, సర్జన్ బర్కతీ, సయార్ అహ్మద్ రేషీ తదితరులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్‌లు సమర్పించారు.

జమాతే ఇస్లామీ.. జమ్మూ-కాశ్మీర్‌లో అతిపెద్ద రాజకీయ, మతపరమైన సంస్థ. దీనికి పాఠశాలలు, ఇతర సామాజిక మౌలిక సదుపాయాలతో కూడిన భారీ నెట్‌వర్క్ ఉండేది. అయితే, ఈ సంస్థ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. 1990ల్లో కాశ్మీర్‌లో ఉగ్రవాద సంస్థ అయిన 'హిజ్బుల్ ముజాహిదీన్'కు సైద్ధాంతిక మార్గదర్శిగా దీనికి పేరుంది. ఈ క్రమంలోనే.. 2019 ఫిబ్రవరి 28న కేంద్రం దీన్ని చట్టవిరుద్ధమైన సంస్థగా ప్రకటించి నిషేధించింది. ఈ యేడాది ఫిబ్రవరిలో ఆ నిషేధాన్ని పొడిగించారు. దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ఈ సంస్థ తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు గుర్తించామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆ సందర్భంగా తెలిపారు. 2019లో ఆర్టికల్ 370 రద్దవడంతో రాష్ట్ర హోదా కోల్పోయి కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జమ్మూకాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. చివరిసారి 2014లో ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఈసారి మూడు విడతల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గానూ.. తొలిదశలో 24 అసెంబ్లీ స్థానాలకు, రెండు, మూడు దశల్లో వరుసగా 26, 40 స్థానాలకు పోలింగ్ జరగనుంది. సెప్టెంబరు 18న తొలి విడత, సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఇదిలా ఉంటే.. బిజెపి 29 మంది అభ్యర్థులతో కూడి మూడో జాబితాను తాజాగా విడుదల చేసింది.

పక్కపక్కనే భారత్, చైనా యుద్ధ నౌకలు..
శ్రీలంక తీరంలో అనూహ్య పరిణామం

న్యూఢిల్లీ, ఆగస్టు 27: ఓ వైపు లద్దాఖ్ సరిహద్దులో సైనిక ప్రతిష్టంభన మరోవైపు హిందూ మహాసముద్రంలో పట్టుకోసం ప్రయత్నాలు ఇలా అనేక అంశాల్లో గత కొంతకాలంగా భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. శ్రీలంక తీరంలో ఇరుదేశాల యుద్ధనౌకలు పక్కపక్కనే లంగరేశాయి. క్షిపణి విధ్వంసక భారత యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ ముంబయి సోమవారం అధికారిక పర్యటన నిమిత్తం కొలంబో తీరానికి చేరుకుంది. అదే సమయంలో చైనాకు చెందిన మూడు యుద్ధ నౌకలు 'హే ఫే', 'వుజిషాన్', 'క్విలియాన్‌షాన్' కూడా ఇదే పోర్టుకు అధికారిక పర్యటనకు వచ్చాయని శ్రీలంక నేవీ ఓ ప్రకటనలో వెల్లడించింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఐఎన్‌ఎస్ ముంబయి శ్రీలంక తీరానికి వెళ్లింది. 163 మీటర్ల పొడవైన ఈ డెస్ట్రాయర్‌లో 410 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌకకు 2001లో భారత నేవీలోకి తీసుకున్నారు. ఈ నౌక శ్రీలంక పోర్ట్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. శ్రీలంక నౌకాదళంతో కలిసి ఇది పలు కార్యక్రమాల్లో పాల్గొననుంది. ఇక ఐఎన్‌ఎస్ ముంబయి కొలంబో తీరంలోఉన్న సమయంలోనే చైనా యుద్ధనౌకలు కూడా అక్కడకు చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. హీఫీ యుద్ధనౌకలో 267 మంది, వుజిషాన్‌లో 872 మంది, క్విలియాన్‌షాన్‌లో 334 మంది చైనీస్ సిబ్బంది ఉన్నారు. ఇవి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించినప్పటికీ వీటి కదలికలను భారత నేవీ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

'వెంకటేష్, ఐశ్వర్య రాజేష్'లపై లవ్లీ హస్బెండ్, వైఫ్ సాంగ్

విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి కలిసి రెండు వరుస హిట్‌లను అందించిన తర్వాత, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తమ హ్యాట్రిక్ చిత్రానికి పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతోంది. ప్రస్తుతం పొల్లాచ్చిలోని కొన్ని అందమైన ప్రదేశాలలో వెంకటేష్, ఐశ్వర్య రాజేష్‌లు పోషించిన భార్యభర్తలపై ఒక అందమైన పాట చిత్రీకరించారు. సంగీతంలో ఫారమ్‌లో ఉన్న భీమ్స్ సిసిరోలియో చార్ట్‌బస్టర్ పాటను సంగీతం అందించారు. భాస్కరభట్ల సాహిత్యాన్ని సమకూర్చారు. డ్యాన్స్ కొరియోగ్రఫీని భానుమాస్టర్ పర్యవేక్షిస్తున్నారు. భార్యాభర్తల ప్రేమను తెలిపే ఉత్తమ పాటల్లో ఇది ఒకటి కానుంది. ఈ చిత్రంలో వెంకటేష్ మాజీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు. ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా నటిస్తుండగా, మీనాక్షి చౌదరి మరో నాయికగా నటిస్తోంది. ఈ త్రికోణ క్రైమ్ డ్రామాలో అతని మాజీ ప్రేయసిగా ఆమె కనిపించనుంది. ఈ సినిమాకు సమీర్‌రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఎడిటింగ్ తమ్మిరాజు. ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ స్క్రీన్‌ప్లేకు సహకరించారు. వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రం 2025 సంక్రాంతి సందర్భంగా థియేట్రికల్ విడుదలకు సిద్ధం కానుంది. తారాగణం: వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, విటి గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి.

పెక్యులర్ లవ్‌స్టోరీ 'సుందరకాండ'

హీరో నారా రోహిత్ ల్యాండ్ మార్క్ 20వ మూవీ 'సుందరకాండ' డెబ్యుటెంట్ వెంకటేష్ నిమ్మల పూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్స్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్న పొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. టీజర్‌ని లాంచ్ మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. నారా రోహిత్ ఇందులో సిద్ధార్థ్ అనే సింగిల్ మ్యాన్ పాత్రలో కనిపించారు. తను మ్యారెజ్ ఏజ్ దాటినప్పటికీ, ఐదు క్వాలిటీస్ కలిగి ఉన్న పార్ట్నర్ కోసం సెర్చ్ చేయడం, తన మ్యాచస్ కోసం పేరెంట్స్ కూడా విసిగిపోవడం టీజర్‌లో హిలేరియస్‌గా అనిపించింది. క్యారెక్టరైజేషన్, కామిక్ టైమింగ్‌తో హ్యూమర్ అందించే నారా రోహిత్‌కి ఈ క్యారెక్టర్ ట్రైలర్ మేడ్‌గా కనిపిస్తుంది. అతని జోడిగా వృతివాఘని ఆకట్టుకుంది. శ్రీదేవి విజయ్ కుమార్ కమ్ బ్యాక్ ఇస్తున్నారు. నరేష్ విజయ్ కృష్ణ రోహిత్ తండ్రి పాత్రలో ఆకట్టుకున్నారు. వాసుకి ఆనంద్ మరో కీలక పాత్రలో కనిపించారు. టీజర్‌లో చూపినట్లుగా, ఈ కథ ప్రతి వ్యక్తికి రిలేట్‌గా చేసుకునేలా వుంది. వెంకటేష్ నిమ్మలపూడి ఫన్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని రూపొందించారని టీజర్ ప్రామిస్ చేస్తోంది. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ వైబ్రెంట్‌గా వుంది. లియోన్ జెమ్స్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హ్యూమర్‌ని ఎలివేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రోహన్ ఎడిటర్ కాగా, రాజేష్ పెంటకోట ఆర్ట్ డైరెక్టర్. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నారారోహిత్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. వెంకీ నాతో ఐదేళ్లుగా జర్నీ చేస్తున్నాడు. ఇదొక సెక్యూలర్‌లవ్‌స్టోరీ. కమ్ బ్యాక్ మూవీగా ఈ స్క్రిప్ట్‌నే లాక్ చేశాం. ఈ సినిమా జర్నీ చాలా స్పెషల్. వెంకీ బ్రిలియంట్ కథ రాశారు. ఈ స్టేజ్ మీద వున్న అందరినీ కథే తీసుకొచ్చింది. టీజర్ మీ అందరికీ నచ్చిందే అనుకుంటున్నాను. లియాన్ జేమ్స్ మంచి ఆల్బం ఇచ్చాడు. మంచి పాటలు కుదిరాయి. మున్ముందు సినిమా నుంచి మరింత కంటెంట్ రాబోతోంది. థాంక్‌యూ ఆల్ అన్నారు. డాక్టర్ నరేష్ వికె మాట్లాడతుతూ, 'సుందరకాండ' లాంటి లవ్‌స్టోరీ తెలుగులో చూడలేదు. నాకు తెలిసి ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకు రాలేదు. ఇలాంటి లవ్‌లవ్ స్టోరీ ఎవరూ ఉహించలేదు. ఈ టీజర్ నాలుసార్లు చూడాలనిపిస్తుంది. చాలా ప్లజెంట్‌గా వుంది. ఇది థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరు పేరున థాంక్స్. యాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, అందరినీ మళ్లీ కలవడం ఆనందంగా వుంది. నాకోసం ఇంత మంచి క్యారెక్టర్ డిజైన్ చేసిన డైరెక్టర్ వెంకీకి థాంక్. మా నిర్మాతలక థాంక్స్. ఇది చాలా కలర్‌ఫుల్ ఫ్యామిలీ ఫిల్మ్. చాలా హ్యాపీగా ఎంజాయ్ చేస్తూ చూసే సినిమా ఇది ఈ సినిమాలో పని చేసిన అందరికీ థాంక్స్ అన్నారు. నిర్మాత సంతోష్ చిన్న పొల్ల మాట్లాడుతూ, అందరికీ థాంక్ యూ రోహిత్ అన్న థాంక్‌యూ ఆయన ముందుండి నడిపించారు. వెంకీపెద్ద డైరెక్టర్ అవుతారు. అందరికీ పేరుపేరున థాంక్‌యూ అన్నారు.

సెప్టెంబర్ 7న 'జనక అయితే గనక'

దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా జనక అయితే గనక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. వెర్సటైల్ యాక్టర్ సుహాస్ హీరోగా నటించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. సంగీర్తన హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా ఫైనల్ వెర్షన్‌ని చూసిన సుహాస్, యుఎస్‌ఎ హక్కులను సొంతం చేసుకున్నారు. సుహాస్ మాట్లాడుతూ, ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. వెంటనే యుఎస్‌ఎ హక్కులను తీసుకున్నాను. పక్కా ఎంటర్‌టైనింగ్ సినిమా అవుతుంది. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ అబ్బాయిగా ఈ సినిమాలో కనిపిస్తాను. తప్పకుండా ప్రేక్షకులు పడీ పడీ నవ్వుకుంటారు. మా డైరెక్టర్ చాలా మంది సినిమా చేశారు. దిల్‌రాజు సపోర్ట్‌చేసిన తీరుమర్చిపోలేం అన్నారు. నటీనటులు: సుహాస్, సంగీర్తన, రాజేంద్ర ప్రసాద్, గోపరాజు రమణ తదితరులు. సాంకేతిక బృందం: బ్యానర్: దిల్‌రాజు ప్రొడక్షన్స్, సమర్పణ: శిరీష్, నిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి, రచన- దర్శకత్వం: సందీప్ బండ్ల, సంగీతం: విజయ్ బుల్గానిన్, డిఒపి: సాయి శ్రీరామ్, ఎడిటర్, కోదాటి పవన్ కల్యాణ్, ప్రొడక్షన్ డిజైనర్: అరసవిల్లి రామ్‌కుమార్, కాస్ట్యూమ్ డిజైనర్: భరత్ గాంధీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అకుల్.

'35-చిన్న కథ కాదు' చిత్రం 6న విడుదల

35 - చిన్న కథకాదు చిత్రం అనేది నివేదాథామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన కొత్త-యుగం క్లీన్ ఫ్యామిలీ డ్రామా. నందకిషోర్ ఈమని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్ వాల్టేయిర్ ప్రొడక్షన్స్ పతాకాలపై నిర్మించారు. టీజర్, పాటలు, ఇతర ప్రోమోలకు అద్భుతమైన రెస్పాన్స్ రావడంతో సినిమా ప్రచార కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌తో వచ్చారు. 35-చిన్న కథ కాదు సెప్టెంబర్ 6న రెండు వారాల్లోపు సినిమాల్లోకి ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళభాషల్లో ఒకేసారి విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేయనున్నారు. ఈ సినిమాని ఎంపిక చేసిన కొద్ది మందికి ప్రదర్శించగా పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఇది ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతుంది. విడుదలతేదీ పోస్టర్‌లలో ప్రధాన తారాగణం యొక్క సంతోషకరమైన భావాన్ని వెలిబుచ్చారు. గ్రామీణ నేపథ్యంలో సెట్ చేయ బడిన, 35-చిన్న కథ కాదు హాస్యం, భావోద్వేగ లోతు యొక్క సమ్మేళనంతో సాపేక్షమైన కథ నాన్ని అల్లింది, అర్థవంతమైన సందేశాన్ని అందిస్తుంది. నికేత్ బొమ్మి కెమెరా కాగా, వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు. ప్రొడక్షన్‌డిజైన్: లతా నాయుడు, ఎడిటింగ్, టీసీ ప్రసన్న. తారాగణం: నివేదా థామస్, ప్రియ దర్శి, విశ్వదేవ్, గౌతమి.

'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ' షురూ..

ఎంఎం ఆర్ ఆర్ట్ క్రియేషన్స్ ప్రొడక్షన్ పతాకంపై కిరణ్ దర్శకత్వంలో ప్రొడ్యూసర్ మంద మల్లికార్జున రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ' సినిమా హైదరాబాద్ రామానాయకుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కిరణ్ ఎఎన్‌కె, ప్రొడ్యూసర్ మంద మల్లికార్జున రెడినడ, హీరో శ్యామ్ షెల్వన్, హీరోయిన్స్ హాన్వీక, రితిక, గ్రీష్మ, హీరోయిన్ ఎస్తేర్, జి.ఎల్.ఫనీకాంత్, తదితరులు పాల్గొన్నారు. డివొపి గాజుల శివ, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, భాస్కర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మోహన్ కృష్ణ, లిరికల్ రైటర్ రాము కుంభగిరి కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎల్ ఫణి కాంత్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ప్రొడ్యూసర్ మంద మల్లికార్జున రెడ్డి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ, నేను కొత్త వాడినైనా మా నిర్మాత మల్లికార్జున్ రెడ్డి ఈ కథను నమ్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ఆయనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఈచిత్రం లవ్ స్టోరీతో పాటు మంచి మెసేజ్ కూడా ఉంటుంది. ఈ చిత్రం డెఫినెట్‌గా యూత్‌తో పాటు టోటల్ కుటుంబ సమేతంగా చూసే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాము అన్నారు. చిత్ర నిర్మాత మంద మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ చిత్రం కథ విన్న వెంటనే చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. సెప్టెంబర్ ఫస్ట్ నుంచి రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనున్నామన్నారు.

13న 'కళింగ'

కిరోసిన్ సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న ధృవవాయు.. ఇప్పుడు కళింగఅంటూ కొత్త కాన్సెప్ట్ తో హీరోగా, దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్నారు. బిగ్ హిట్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మిస్తున్న ఈ సినిమా మీద ఇప్పటికే మంచి హైప్ ఏర్పడింది. టీజర్, పోస్టర్‌లు, గ్లింప్స్, సాంగ్స్ అన్నీ కూడా అందరినీ ఆకట్టు కున్నాయి. తాజాగా ఈ మూవీని సెప్టెంబర్ 13న విడుదల చేయబోతున్నామంటూ ప్రకటిస్తూ ఓ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో.. 'హీరో, దర్శకుడు ధృవ వాయు మాట్లాడుతూ, టీజర్, పోస్టర్ వీటితోనే కళింగ మీద హైప్ పెరిగింది. ఆల్రెడీ అన్ని చోట్లా బిజినెస్ అయింది. కంటెంట్ అందరికీ నచ్చడంతో అన్నిచోట్లా డీల్స్ అయిపోయాయి. ఇది కచ్చితంగా రెగ్యులర్ మూవీలా మాత్రం ఉండదు. అన్ని రకాల అంశాలు ఇందులో ఉంటాయి. ఎమోషన్స్, లవ్, కామెడీ, హారర్, థ్రిల్లర్ ఇలా అన్నీ కావాలని పెట్టలేదు. టీజర్, సాంగ్స్ చూడని వాళ్లంతా టీ-సిరీస్ యూట్యూబ్ చానెల్‌లోచూడండి. కంటెంట్, స్క్రీన్ ప్లే చాలా టైట్‌గా ఉంటుంది. ఇంత వరకు ఇలాంటి కాన్సెప్ట్‌తో తెలుగులో అయితే రాలేదు. కచ్చితంగా ఈ సినిమాను థియేటర్లో చూసి ఆదరించండి. మా సినిమా సెప్టెంబర్ 13న రాబోతోంది అని అన్నారు. కెమెరామెన్ అక్షయ్ మాట్లాడుతూ, కళింగ సినిమా కోసం టీం అంతా చాలా కష్టపడింది. చాలా వరకు ఫారెస్ట్ ఏరియాల్లోనే షూట్ చేశాం. వర్షం, ఎండ అంటూ ఇలా చాలా కష్టపడాల్సి వచ్చింది. సినిమా మాత్రం అద్భుతంగా వచ్చింది. ఏ ఒక్కర్నీ నిరాశపర్చని మాత్రం గ్యారెంటీ ఇస్తాను' అని అన్నారు. నిర్మాత దీప్తి కొండవీటి మాట్లాడుతూ, కళింగ గురించి అక్షయ్ సగం చెప్పాడు. వంశీ మిగతా సగం చెబుతాడు. సెప్టెంబర్ 13న మా చిత్రం రాబోతోంది. సినిమాను చూసిన తరువాత ఓ మంచి ఫీలింగ్‌తో బయటకు వెళ్తారు. కళింగ అనేది ధృవ వాయుఐడియా. మేం ఆయనకు సపోర్ట్ చేశామంతే అని అన్నారు. 'హీరోయిన్ ప్రజ్ఞా నయన్ మాట్లాడుతూ, కళింగ సినిమా అద్భుతంగా వచ్చింది. చాలా వరకు అవుట్ డోర్‌లో, ఫారెస్ట్ తీశాం. ఈ చిత్రానికి మొదటి హీరో కెమెరామెన్ అక్షయ్. ఆయన ఈ మూవీని అద్భుతంగా క్యాప్చర్ చేశారు. ధృవవాయు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను తీశారు. సెప్టెంబర్ 13న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి'అని అన్నారు.

ప్రియాంక అరుళ్ మోహన్ నయా లుక్

విడుదలకు రెడీ 'ఉరుకు పటేల'..

హుషారు వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తేజస్ కంచెర్ల. తేజస్ చేస్తోన్న తాజా చిత్రం 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికి ఫైడ్' సినిమా ట్యాగ్ లైన్. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మించారు. సెప్టెంబర్ 7న ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందించిన ఈసినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, 'పట్నం పిల్లా..', "ఒరి మాయలోడా' సాంగ్‌లకు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో ఈ చిత్రం నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. హీరోకి పెళ్లి వయసు వచ్చినా పెళ్లి కావటం లేదని బాధ ఎక్కువ అవుతుంటుంది. అందుకు కారణం.. తనేమీ చదువుకోడు.. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే మన అందమైన హీరో యిన్ అతన్ని ప్రేమిస్తుంది. చాలా మంది చదువుకున్న అమ్మాయిలకు నచ్చని హీరోని హీరోయిన్ మాత్రం ఎందుకు ప్రేమించిందా! అనేది చాలా మందిలో ఉండే ప్రశ్న. కానీ..కథలో అసలు ట్విస్ట్ అదే. మన హీరోయిన్‌లో మరో కోణం బయటకు వస్తుంది. దెబ్బకు హీరో భయపడతాడు. ఏం చేయాలో తెలియక పారిపోవాలనుకుంటాడు. ఇంతకీ హీరోయిన్ ఏం చేసింది.. ఆమెను చూసి హీరో ఎందుకు భయపడ్డాడు.. చివరకు ఏమైందనేది తెలుసుకోవాలంటే సెప్టెంబర్ 7న రిలీజ్ కాబోతోన్న సినిమాను చూడాల్సిందేనంటున్నారు దర్శక నిర్మాతలు.



'సారంగపాణి జాతకం' టైటిల్ ఖరారు

శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు మోహన కృష్ణ ఇంద్రగంటి కాంబినేషన్‌లో ఇదివరకే 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' లాంటి చక్కటి విజయవంతమైన సినిమాలు వచ్చాయి. తాజాగా వాళ్లిద్దరి కలయికలో ప్రియదర్శి కథానాయకుడిగా మరో చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు 'సారంగపాణి జాతకం' అనే టైటిల్ ఖరారు చేయగా, ఈ రోజు టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. చిత్రనిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ,'మనిషి భవిషత్తు అతని చేతిరేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసేచేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రం 'సారంగపాణి జాతకం' ప్రారంభం నుంచి ముగింపు వరకు నవ్వించే ఓ పూర్తి స్థాయి జంధ్యాల తరహా వినోదాత్మక సినిమా ఇది. మోహనకృష్ణ ఇంద్రగంటి ఈ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఆయనతో మా సంస్థలో మూడో చిత్రమిది. ప్రియదర్శి, 'వెన్నెల' కిషోర్, వైవా హర్ష, నరేష్ విజయకృష్ణ, తనికెళ్లభరణి, శ్రీనివాస్ అవసరాల వంటి హేమాహేమీలు ఈ కథలో భాగం అయ్యారు. హీరోయిన్ రూపకొడువాయూర్, వడ్లమాని శ్రీనివాస్, రూపాలక్ష్మి, కల్పలతలు కూడా మంచి పాత్రలు చేశారు. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నతస్థాయిలో ఉంటుంది. ఇందులో నాలుగు పాటలు ఉన్నాయి. వివేక్‌సాగర్ అద్భుతమైన బాణీలు అందించారు. సంగీతానికి మంచి ప్రాముఖ్యత ఉంది. మా సంస్థల్లో 15వ చిత్రమిది. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం', 'యశోద'- హాట్రిక్ విజయాల తర్వాత ఈ సినిమాతో ప్రేక్షకులకి మంచి సినిమా అందివ్వబోతున్నాం. 90 శాతం చిత్రీకరణ పూర్తి అయ్యింది. హైదరాబాద్, రామోజీ ఫిల్మ్ సిటీ, విశాఖలో ఇప్పటి వరకు నాలుగు షెడ్యూల్ పూర్తి చేశాం. నేటి నుండి సెప్టెంబరు 5 వరకు రెండు పాటలు, మిగతా సన్నివేశాలు చిత్రీకరణతో సినిమాని పూర్తి చేస్తున్నాం' అని అన్నారు. సారంగపాణి జాతకం ఫస్ట్‌లుక్ విడుదల చేసిన సందర్భంగా దర్శకుడు మోహన్‌కృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ, 'నమ్మకం మనిషికి బలాన్ని ఇస్తుంది. కానీ మూఢనమ్మకం బుద్ధిమంతుడిని కూడా బలహీనుడిని చేసి నవ్వుల పాలు చేస్తుంది. అలా నవ్వుల పాలైన ఓ మధ్యతరగతి మంచి అబ్బాయి కథే 'సాంగరపాణి జాతకం' తన నమ్మకం, తను ఇష్టపడిన అమ్మాయి ప్రేమ మధ్య కొట్టుమిట్టాడి రెండింటికి చెడ్డ రేవడయిపోయాడా? లేదా బయట పడ్డాడా? అనే కథాంశాన్ని ఉత్కంఠభరితంగా కడుపుబ్బా నవ్వించే హాస్యంతో చెప్పాం. హీరో పాత్రలో భావోద్వేగాలను, వినోదాన్ని ప్రియదర్శి తనదైనశైలిలో అద్భుతంగా పండించగా.. అచ్చ తెలుగు అమ్మాయి రూప కడువయూర్ తన అభినయంతో కట్టిపడేస్తుంది. సకుటుంబ సమేతంగా హాయిగా చూడగలిగితే ఒక హాస్య సంబంధం ఈ సినిమా. ఉన్నత సాంకేతిక ప్రమాణాలు అందించే శ్రీదేవి మూవీస్ సంస్థఈసినిమా నిర్మాణంలోనూ ఎక్కడారాజీపడలేదు. పీజీ విందా ఛాయా గ్రహణం, వివేక్ సాగర్, సంగీతం, మార్తాండ్ కె వెంకటేష్ కూర్పు, రవీందర్ కళా దర్శకత్వం ప్రేక్షకులు అందరినీ ఆకట్టుకుంటాయి. అని చెప్పారు. తారాగణం: ప్రియదర్శి, రూపకొడువాయూర్, నరేష్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాలు, 'వెన్నె' కిషోర్, వైవా, హర్ష.

ఒక డ్యాన్స్ చేద్దామా?

మనసుకు నచ్చినదైనా, కాస్త హుషారెక్కించే పాటైనా చెవుల్లో పడితే చాలు..సంగీతానికి తగ్గట్టుగా కాలు ఆడిస్తుంటాం. ఇక వేడుకల్లో అయిన వాళ్లంతా ఓ చోట చేరితే అందరితో కలిసి శరీరాన్ని కదిలించడమూ మామూలే. ఇక నుంచి ఇంట్లోనూ ఆ సరదాని ప్రయత్నించేయండి. ఎందుకంటే.. ఇంటి పనులు చేస్తున్నాం. ఇక ప్రత్యేకంగా వ్యాయామమెందుకు.. చాలామంది మహిళల అభిప్రాయమిదే! ఇక కొందరు తోడు లేరనో, నలుగురు ముందూ జిమ్ముల్లో కుస్తీ పడటం ఇష్టంలేకో ఎక్సర్‌సైజ్‌లకు దూరమవుతున్నారు. దీంతో కనీస శారీరక శ్రమ లేక శరీరం, మనసు రెండూ అనారోగ్యాలపాలవుతున్నాయి. ఈ రెంటినీ ఉత్తేజపరిచే సాధనం డ్యాన్స్, అందుకే రోజూ నచ్చిన పాట పెట్టుకుని చిందేయండి. అయ్యో.. మాకు అసలు డ్యాన్సే రాదే అంటారా? ఇదేమైనా వేదికపై ఇచ్చే ప్రదర్శనా? రాదు అని చింతించడానికి సరదాగా అలా అలా శరీరాన్ని ఊగిస్తూ అలా అలా కదిల్చినా చాలు. పైగా ఇది ఫుల్ బాడీ వర్కవుట్. పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఎవరికైనా అనువైనదే! చదువు, పని ఒత్తిడికితోడు నెలసరి సమయంలో హార్మోన్లలో మార్పు మనల్ని ఎంత ఉక్కిరిబిక్కిరి చేస్తాయి? పిల్లలు పుస్తక ప్రతిదీ మర్చిపోవడం, చిన్న చిన్న విషయాలూ త్వరగా గుర్తుకు రాకపోవడం వంటి సమస్యలు సరేసరి. వీటికీ కాలు కదపడానికి మించిన పరిష్కారం లేదట. డ్యాన్స్‌లో శరీరం మానరతమే కదులుతుంది అనుకునేరు. శరీరాన్ని సమన్వయం చేసుకుంటూనే లయకు తగ్గట్టుగా ఆడటానికి ప్రయత్నిస్తాం కదా.. అది మెదడుకీ వ్యాయామంలా పని చేస్తుందట మ్యూజిక్‌ని గమనించడం మారుతున్నదానికి తగ్గట్టు స్టెప్పులు మార్చడం, కొత్తవాటిని ప్రయత్నించడం అన్నీమల్టీ టాస్కింగ్ కిందకి వస్తాయట. ఆ ప్రభావం మెదడులోని నరాలపై సానుకూల ప్రభావం చూపుతాయట. కాబట్టి, చిన్న చిన్న మరచిపోవడంలాంటివి తగ్గడమే కాదు. భవిష్యత్తులో కండరాలు పట్టేయడం, మతిమరుపుతోపాటు అల్జీమర్స్‌నీ దూరంగా ఉంచుతాయట. ఎన్నిలాభాలో కదా.. అందుకే రోజుకో డ్యాన్స్ చేద్దామా మరి? ◻

ఆన్‌లైన్ సేల్స్‌తో లక్షల ఆదాయం!

యాపిల్స్.. ఇవి మనకు చాలా ఖరీదైన పండ్లు.కానీ స్వర్గధామమైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఇవి సాధారణ ధరకే లభిస్తాయి. అక్కడున్న చాలీ మార్కెట్లలో చేరి.. ఎంతో మంది దళారుల చేతులు మారేసరికి.. వాటి రేటు తడిసి మోపెడవుతుంది. పోనీ అవి అయినా తాజాగా దొరుకుతాయా? అంటే సంవత్సరం క్రితం పండించి కోల్డ్ స్టోరేజ్ చేసిన పండ్లవి. ఎంతో కష్టపడి తన తల్లిదండ్రులు పండించిన యాపిల్స్‌కు ఇలాగే గిట్టుబాటు ధర లభించకపోవడం అపరాజితా భర్వాల్‌ను కలచివేసింది. అందుకే తమ తోటలో పండించిన పండ్లను నేరుగా కస్టమర్ల గడప వద్దకే పంపించేలా ఓ ఆన్‌లైన్ సేల్స్ సంస్థను స్థాపించిందామె. నెలనెలా వందల కిలోల యాపిల్స్‌ని అమ్ముతూ, లక్షల ఆదాయం గడిస్తోన్న ఆమె.. తనతండ్రికి వ్యవసాయంలో మూడింతల లాభాలు రావడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

అపరాజితది హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి. ఆమెది వ్యవసాయాధారిత కుటుంబం. ఆమె తల్లిదండ్రులు యాపిల్స్ ఎక్కువగా పండిస్తుంటారు. అయితే చిన్నతనం నుంచి చదువు పైనే ఎక్కువ దృష్టి పెట్టిన ఆమె ఒకానొక సమయంలో తన సొంతూనరు వదిలి నగరానికే వెళ్లి స్థిరపడాలనుకుంది. ఈ పల్లెటూళ్లో కెరీర్‌లో ఎదగడానికి ఎలాంటి అవకాశాలు ఉండవు. అందుకే ఎప్పటికైనా నగరానికే వెళ్లి స్థిరపడాలనుకున్నా. మనది వ్యవసాయాధారిత దేశమే అయినా.. ఈ వృత్తికి అంత విలువ కూడా లేదనిపించేది. కానీ నగరానికి వెళ్లాక మనసు మార్చుకున్నా. అంటోంది అపరాజిత.

ధర తెలిసి అవాక్కయ్యా! ... స్కూలింగ్ పూర్తయ్యాక పై చదువుల కోసం బెంగళూరు వెళ్లిన ఆమెకు.. 2017ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగమొచ్చింది. మంచి జీతం, ఉన్నత హోదా.. ఇంతకంటే కావాల్సిందేముంది? అనుకుందామె. అయితే ఓసారి తన ఫ్రెండ్స్‌తో కలిసి అక్కడి వ్యాపారుల్ని అడిగి తెలుసుకుందామె. నెలల క్రితం పండించిన యాపిల్స్‌ని కోల్డ్ స్టోరేజ్ యూనిట్లలో భద్రపరిచి రవాణా చేయడం, సంవత్సరం పొడవునా వీటిని అమ్మడం గురించి తెలుసుకొని షాకయ్యా. మా ఊళ్లో పండే తాజా యాపిల్స్‌లో పోల్చితే వీటి ధర దాదాపు మూడింతలు ఎక్కువ. అంత కష్టపడిన మా పేరెంట్స్ కంటే దళారులకే ఎక్కువ ధర లభించడం నన్ను ఆలోచనలో పడేసింది. దీనికి ఎలాగైనా ఏదో ఒక పరిష్కారం కనుక్కోవలనిపించింది. ఇదే 2021లో 'ఫల్ ఫూల్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించేదుకు దోహదం చేసింది. అంటోంది అపరాజిత.

ఆన్‌లైన్లో... యాపిల్ సేల్స్.. తమ తోటలో పండించిన యాపిల్స్‌ని నేరుగా కస్టమర్ల గడప వద్దకు చేర్చే ఆన్‌లైన్ వేదిక ఇది. తొలి ప్రయత్నంగా 'హిమ్2హోమ్' పేరుతో అపరాజిత ఆన్‌లైన్లో అమ్మిన యాపిల్స్ హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆ తర్వాత కూడా ఇలాంటి సేల్స్‌ని ఆన్‌లైన్లో నిర్వహించిన ఆమెకు కస్టమర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇదే తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందంటోందీ రైతు బిడ్డ. చాలావరకు మార్కెట్లో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన యాపిల్స్‌నే విక్రయిస్తుంటారు. ఇక మన దేశంలో దొరకని యాపిల్స్‌నైతే విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఏడాది పొడవునా అవి తాజాగా ఉండేందుకు పలు రసాయనిక పద్ధతుల్ని ఉపయోగిస్తుంటారు. ఇలాంటి యాపిల్స్ ఆరోగ్యానికి

అస్సలు మంచివి కావు. అంత ధర పెట్టి కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడం కంటే తాజా యాపిల్స్‌ని ఆన్‌లైన్‌లో విక్రయిస్తే.. అటు కస్టమర్లూ నష్టపోకుండా ఉంటారు. ఇటు ఇంత కష్టపడిన అమ్మానాన్నలకు గిట్టుబాటు ధర కూడా లభిస్తుంది కదా అనిపించింది. ఈ క్రమంలోనే ఆన్‌లైన్లో తొలుత ప్రయోగాత్మకంగా నిర్వహించిన సేల్స్‌కు మంచి స్పందన రావడంతో ఇక వెనుతిరిగి చూడలేదు.. అంటోంది అపరాజిత.

తానే రైతై .... తన తల్లిదండ్రులు పండించే యాపిల్స్‌ని విక్రయించే క్రమంలో అపరాజితకూ వ్యవసాయంపై మక్కువ పెరిగింది. అందుకే హైదరాబాద్‌లోని 'అరణ్య అగ్రికల్చరల్ ఆరల్టర్‌నేటివ్ష్' నుంచి పార్మాకల్చర్ అనే కోర్సు పూర్తి చేసిందామె. వివిధ రకాల మొక్కల్ని ఒకే చోట పెంచడం దీని ముఖ్యోద్దేశం. ఈ రోజుల్లో చాలామంది ఒక ఏడాదిలో ఒకే పంటను పండిస్తున్నారు. కానీ నేను వివిధ రకాల మొక్కల్ని ఒకే పొలంలో సాగు చేయాలనుకున్నా. దీని గురించి లోతుగా తెలుసుకోవడానికిప పార్మాకల్చర్ కోర్సు చదివా. చూడ్డానికి అడవి ఎలా ఉంటుందో.. పెర్మాకల్చర్ తోట కూడా అలాగే ఉంటుంది. ఇలా విభిన్న పంటల్ని ఒకే చోట పండించడం వల్ల మట్టి మరింత పోషకభరితంగా మారుతుంది. ఈ ఆలోచనతోనే మా పొలంలోనే కొంత భాగాన్ని తీసుకొని.. వివిధ రకాల పూల మొక్కలు, కాయగూరలు పెంచుతున్నా. వీటినీ ఆన్‌లైన్‌లో విక్రయించడంతో పాటు వీటి నుంచి ఉత్పత్తైన విత్తనాల్నీ అమ్మకానికి ఉంచా. ఇలా ఈ ఆన్‌లైన్ వేదికగా కస్టమర్లకు సహజసిద్ధమైన, ఆరోగ్యకరమైన.. యాపిల్స్ కాయగూరల్ని అందిస్తున్నానన్న సంతృప్తి నాకు దక్కుతోంది.. అంటోందీ యువ రైతు. ◻

పనులు పూర్తవడం లేదా?

ఉద్యోగాల్లో కొన్ని సందర్భాలు డెడ్‌లైన్‌తో ఉంటాయి. మరో పక్క ఇంట్లో పనులూ ఓ పట్టాన తెమలవు. దీంతో తెలియని ఆందోళన.. దేనిపైనా దృష్టిపెట్టలేకుండా చేస్తుంది. అలాకాకూడదంటే..

మల్టీ టాస్కింగ్ చేయడంలో మహిళలు సమర్థులంటారు! కానీ ఆ అలవాటు అన్ని సమయాల్లోనూ మంచిదికాదు. ముఖ్యంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు దీని జోలికి పోవద్దు అంటారు. కెరియర్ నిపుణులు. దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించగలిగితే దానిమీదే శ్రద్ధపెట్టి త్వరగా పూర్తి చేయొచ్చు. ఇలా పనులన్నింటికీ ఓజాబితా రాసుకుంటే.. మనలో ఆందోళన తగ్గించడానికి ఈ స్పష్టత చాలు.

- పని పూర్తి చేయాలనే తొందరలో విరామం తీసుకోకుండా పనిచేస్తుంటారు కొందరు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరకపోగా మరింత ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటప్పుడు పనిని కాసేపైనా వాయిదా వేయడం మంచిదే. ఆ సమయంలో ఓ మంచి కాఫీ తాగండి. నచ్చిన మరో అంశంపై దృష్టిపెట్టండి . లేదా ఓ చిన్న కునుకు తీయండి. ఇవన్నీ మీ కంగారుని తగ్గిస్తాయి. తిరిగి ఉత్సాహంగా పనులు మొదలు పెట్టే శక్తినిస్తాయి.
- ఒక్కోసారి ఒత్తిడితో కూడుకున్న పనులు రెండుమూడురోజులు కూడా కొనసాగొచ్చు. అలాంటప్పుడు రోజుకి కనీసం గంటైనా ఏదైనా వ్యాయామం చేయండి. అది ఆందోళనని ఎదుర్కొనే శక్తినిస్తుంది. మెదడుని చురుగ్గా మార్చగలిగే బాదం, వాల్‌నట్స్ వంటివి తినండి. మనసుని ప్రశాంతంగా ఉంచే కొన్ని గుమ్మడి గింజల్ని నోట్లో వేసుకోండి. ఇవన్నీ ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేయగలిగే ఏకాగ్రతనీ పెంచుతాయి. ◻

సగ్గుబియ్యం మురుకులు

కావలసినవి : బియ్యప్పిండి కప్పు, సగ్గుబియ్యం పావుకప్పు,పెరుగు పావుకప్పు, మినప్పప్పు-రెండు టేబుల్‌స్పూన్లు, నువ్వులు చెంచా,కారం అరచెంచా, నూనె: వేయించేందుకు సరిపడా, ఉప్పు: తగి నంత,

తయారీ విధానం : పెరుగులో సగ్గుబియ్యం వేసి కనీసం మూడు గంటలసేపు నానబెట్టుకోవాల. తరువాత అందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి. అవసరం అయితే.. నీళ్ల చల్లుకుంటూ మురుకులు పిండిలా చేసుకోవాలి. చివరగా రెండు చెంచాల వేడినూనె కూడా వేసి ఓసారి కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని మురుకుల గొట్టంలో తీసుకుని, కాగుతున్న నూనెలో జంతికల్లా వత్తుకుని ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. ◻

చర్మం కూడా అలసిపోతుందట !

కాసేపు పని చేస్తే చాలు. ఎక్కడ లేని అలసట వచ్చేస్తుంది. ఈ అలసట మిగతా శరీర భాగాలకే కాదు.. చర్మానికీ ఉంటుందంటున్నారు నిపుణులు. అవును.. మనం అంతగా పట్టించుకోం కానీ. మన చర్మం కూడా అలసిపోతుందట! అందుకు ఉదాహరణే అప్పుడప్పుడు ముఖం వాడిపోయినట్లు కనిపించడం. మరి, అలసిన చర్మం తిరిగి సాంత్వన పొంది తాజాగా మారాలంటే ఏం చేయాలి? చూద్దాంరండి..

మృతకణాలు తొలగించాలి.... చర్మం అలసిపోయినట్లు కనిపించడానికి సగం కారణం ముఖంపై ఏర్పడే మృతకణాలే. అందుకే వీటిని ఎప్పటికప్పుడు స్క్రబ్ చేస్తూ తొలగించుకుంటే చరనమం తాజాదనాన్ని సంతరించుకంఉటుంది. చర్మ ఛాయ కూడా మెరుగుపడుతుంది. కనీసం వారానికి ఒకసారైనా ముఖం, చర్మంపై పేరుకున్న మృతకణాల్ని తొలగించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం.. ఒక టేబుల్ స్పూను ఓట్స్ పొడి, పావు టీస్పూను ఉప్పు తీసుకొని, దీనికి నీళ్ల లేదా ఆలివ్ ఆయిల్ జతచేసి మెతనతని పేస్ట్‌లా చేయండి. ఈ మిశ్రమంలో ముఖాన్ని మృదువుగా రుద్దుతూ ముఖంపై పేరుకున్న మురికి, దుమ్ము, మృతకణాల్ని తొలగించుకోవాలి.

ఐస్ థెరపీ..... అలసిన చర్మానికి సాంత్వన చేకూర్చడానికి ఐస్‌థెరపీ ఒక చక్కటి పరిష్కారం అంటూన్నరు నిపుణులు. ఈ క్రమంలో ఐస్ ముక్కల్ని తీసుకుని ముఖంపై మృదువుగా రుద్దండి తద్వారా చర్మానికి రక్తప్రసరణ మెరుగై ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.

నీళ్లు ఎక్కువగా.. నీళ్లు ఎక్కువగా తాగడం వల్లశరీరానికే కాదు.. చర్మ ఆరోగ్యానికీ మంచిది. శరీరంలో నీటిస్థాయిలు తగినంత ఉన్నప్పుడే చర్మం తాజాగా కనిపిస్తుంది. అందుకే రోజుకు కనీసం రెండు లీటర్ల నీళ్లు తాగడం. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాహారం తీసుకోవడం తప్పనిసరి!

ఉప్పు తగ్గించాలి... మనం తీసుకునే ఆహారంలో ఉప్పు పరిమాణం పెరిగితే కళ్ల కింద క్యారీ బ్యాగులు, నల్లటి వలయాలు రావడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి నిపుణుల సలహా మేరకు ఉప్పును తగిన మోతాదులో తీసుకోవడం అటు ఆరోగ్యానికి, ఇటు అందానికీ మంచిది.

- తగినంత నిద్ర లేకపోయినా చర్మం అలసిపోతుంది. అందుకే రోజుకు కనీసం ఎనిమిది గంటలైనా నిద్రకు కేటాయించడం మంచిదంటున్నారు నిపుణులు.
- చర్మంలో తేమను నిలిపి ఉంచడంలో మాయిశ్చరౌజర్ పాత్ర కీలకం! కాబట్టి ఏ కాలమైనా, రాత్రుళ్లు మేకప్ తొలగించాక మాయిశ్చరైజర్ రాసుకోవడం మర్చిపోవద్దు.
- . ఇంట్లో తయారు చేసుకునే సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లతోనూ చర్మాన్ని తాజాగా, ప్రకాశవంతంగా మెరిపించుకోవచ్చు. ఈ క్రమంలో మీ చర్మతత్వాన్ని బట్టి ఏ ప్యాక్ వేసుకుంటే మంచిదో నిపుణుల్ని అడిగి తెలుసుకొని ప్రయత్నించచ్చు. ◻

మోకాళ్ల నొప్పులా..

చూడ చక్కని లిచీపండు రుచిగా ఉండటమేకాదు.. ఎన్నో పోషకాలనూ అందిస్తుంది. దీన్ని తరచూ తినడం వల్ల పొందే ప్రయోజనాలెన్నో..

- దీంట్లో విటమిన్-బి6, విటమిన్-సి, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ఐరన్, ఫాస్పరస్, ఫైబర్ ఉంటాయి.
- శరీరంలోని ఫ్రీరాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. రొమ్ము క్యాన్సర్ బారినపడకుండా కాపాడుతుంది.
- రక్తంలో ఉండే చెడు కొలస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. గుండెపోటుకు గురికాకుండా కాపాడుతుంది.
- రక్తంలో ఉండే చెడు కొలస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. గుండెపోటుకు గురికాకుండా కాపాడుతుంది.
- జీర్ణరసాల ఉత్పత్తిని పెంచి.. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. జీర్ణప్రక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది.
- . మెగ్నీషియం, ఫాస్పరస్ ఎముక దృఢత్వానికి దోహదపడతాయి. వృద్ధాప్యంలో ఎముకలు పెళుసులా కాకుండా నియంత్రిస్తుంది.
- . పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుంది.
- . మోకాళ్ల నొప్పులూ, కాళ్లు, కీళ్ల నొప్పుల బారినపడకుండా కాపాడుతుంది.
- పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల అధిక రక్తపోటును నియంత్రిస్తుంది.
- ఇనుము, కాపర్ రెండూ ఉండటం వల్ల ఎర్రరక్త కణాల వృద్ధికి తోడ్పడుతుంది. హిమోగ్లోబిన్‌ను పెంచి రక్తహీనత సమస్య లేకుండా చేస్తుంది.
- ముఖం, శరీరం మీద ముడతలు రాకుండా నివారిస్తుంది. వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తుంది.
- పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- వైరస్‌లను శరీరంలోకి ప్రవేశించకుండా చేస్తుంది. వాటి వృద్ధినీ అడ్డుకుంటుంది. ◻

ఆ భద్రత ఇచ్చారా?

ప్రేమించి అయితేనేం, పెద్దలు చూపించిన వాడైతేనేం.. జీవిత భాగస్వామి విషయంలో తుది నిర్ణయం మాత్రం చాలావరకూ అమ్మాయిల చేతుల్లోనే ఉంటోంది. కానీ చూడటానికి బాగుండీ, బాగా సంపాదిస్తేనే సరిపోదు కదా! కలిసి నడవడానికి మరికొనినన అంశాలు కావాలి. మరి వాటినీ గమనించు కున్నారా?

ప్రతి అమ్మాయికీ నాన్నే హీరో కదూ! ప్రతి విషయం లో మనకు అండగా నిలు స్తారు. ఆయన పక్కనుంచే తెలియని భరోసా ఉంటుంది. మరీ చేసుకునే వ్యక్తీ అలాంటి భద్రతా భావన కలిగించారా? స్నేహమో, కొన్నాళ్లు కలిసి పనిచేయడమో కాదు.. నచ్చకపోతే ఆపేయడానికి. ఏళ్లపాటు ఒకరి కొకరుగా కలిసి సాగాలి. అలాంటప్పుడు నమ్మకం, భరోసా తప్పనిసరి. అవి దొరికితేనే అది ముచ్చ టైన కాపురం అవుతుంది.

దాంపత్యం కూడా స్నేహం లాంటిదే! ఇక్కడ ఎవరూ ఎక్కువా కాదు, తక్కువ కాదు. కాబట్టి, గౌరవం ఉండాలి. భావోద్వేతాలకు విలువనివ్వాలి ఇబ్బంది తెలుసుకుని సాయం చేయాలి. మరి అతనిలో ఈ లక్షనాలు ఉన్నాయా అని తప్పక గమనించుకోవాలి. ఇప్పట్నుంచే నేను చెబుతాను నువ్వు వినాలి అన్నట్లుగా ప్రవరినతంచడం, ఫీలింగ్స్‌ని పట్టించుకోకపోవడం, మీ పనికి, ఇష్టాలకు విలువ లేనట్లుగా ఉండటం చేస్తే తరవాత సంగతేంటి? అందుకే మీ చెక్ లిస్ట్‌లో వీటికీ చోటివ్వండి. ఇక పెల్లయ్యాక గడప దాటేది అమ్మాయిలే. అప్పటిదాకా ఉన్న కుటుంబాన్ని వీడి కొత్తవారితో జీవించాలి. అలాంటప్పుడు కొన్ని సర్దుబాట్లు తప్పనిసరి. అయితే అది ఇరువైపులా ఉండాలి కదా! ఎంత సేపూ మా వాళ్లకి నచ్చవు. మా ఇంట్లో ఇలా అంటూ ఒకవైపే మాట్లాడుతున్నా ఆలోచించుకోండి. పెళ్లన్నాక కొన్ని సర్దుకుపోవడాలు, అలవాట్లు మార్చుకోవడం లాంటివి తప్పనిసరి. అయితే అది బలవంతంగా కాదు, ఇష్టంగా .. మీకు నచ్చి చేయగలగాలి. అంతేకానీ మీ ఆస్తిత్వానేనన కోలోనపతున్నట్లుగా ఉండకూడదు.మీరు చెప్పిన ప్రతిమాటకీ 'జీ హుజూర్' అనక్కర్లేదు. కానీ ఆ మాటకు విలువనివ్వాలి. తప్పొప్పులు చెప్పగలగలి నమ్మకం అండగా ఉడటం, అర్థం చేసుకోవడం.. లాంటివీకనిపించాలి. అప్పుడే ఓకే చెప్పండి. ◻

కన్నయ్య కనిపించాడు..

అది మధురా నగరం. మాధవుణ్ణి కళ్లారా చూడాలని పండ్లు అమ్ముకునే యువతి ఎదురుచూస్తోంది. కన్నయ్యకు ఏదైనా తినిపించాలని కలలు కంటూ వీధుల్లో వెతుకుతుండేది. ఎప్పట్లాగే పండ్లు.. పండ్లు అని అరుస్తోంటే దూరం నుంచి తాజావేనా? అని వినిపించి వెనుతిరిగింది. బాలగోపాలుడు నవ్వుతూ సైగ చేయగా పరవశంతో చెంతకు వెళ్లి ఒడిలో కూర్చోబెట్టుకుంది. బుట్టలోని పండ్లు తీసి, ఒక్కొక్కటీ ఒలిచి తినిపించింది. కన్నయ్య కనిపించాడు. పండ్లు అరగించాడు అనుకుని పరమానందం చెందింది. ఒక పండు అడిగితే అన్నీ పెట్టేశావు. నువ్వు చాలా మంచిదానివి అంటూ లేచి, చిన్ని కృష్ణుడు చిటికెలో మాయమయ్యాడు. అప్పటికే చీకట్లు కమ్ముకోవడంతో త్వరగా ఇంటికి వెళ్లాలని గంపను అలవోకగా తలకెత్తుకోబోతే.. అది కదల్లేదు. ఖాళీ బుట్ట ఇంత బరువేంటని చూస్తే.. దాన్నిండా వజ్రవైడూర్యాలున్నాయి. కన్నయ్య తాను తిన్న పండ్లకు ఇలా మూల్యం చెల్లించాడా అనుకుని తెల్లబోయింది. కళ్లముందు ఇంకా చిన్న కృష్ణుడే కనిపిస్తున్నాడు. చిరునవ్వులు చిందిస్తున్నాడు. ఆమె గంపను తలకు ఎత్తుకుని, తన ఊరికి బయల్దేరింది.

నల్లని యమునా నదిలో తెల్లని నురగలతో అలలు ఎగసిపడుతున్నాయి. ఆనాడు వసుదేవుడు కన్నయ్యను బుట్టలో మోసుకుని యమున దాటాడు. కన్నయ్య మహిమతో తన గంపలో నవరత్నాలు నిండాయి. తండ్రి లాంటి కన్నయ్య కనిపించాడు. ఈ రంగురాళ్లు నాకెందుకు అనుకుని వాటిని యమునలో గుమ్మరించి, ఆనందంగా నది దాటింది. ◻

ఆధ్యాత్మికం

గ్రంథాలయాల ఏర్పాటుతో..

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతోన్న ఆకర్షణ.. బంధువులు, మిత్రులు, తెలిసిన వారి వద్దకు వెళ్లి వారు చదివేసిన, వృథాగా ఉంచిన పుస్తకాలను సేకరిస్తుంటుంది. ఇప్పటి వరకూ మొత్తం 9, 836 పుస్తకాలతో 15 చోట్ల గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. పుస్తక పఠనం, సేకరణ, గ్రంథాలయాల ఏర్పాటు హాబీగా ఉన్న ఆకర్షణ విభిన్న రకాల సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది. ఈమె ఆసక్తి, ఆలోచనను మెచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ఆమె ఏర్పాటు చేయబోయే 25వ గ్రంథాలయాన్ని తానే ప్రారంభిస్తానని మాటిచ్చారు. అంతేకాదు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే 'ఎట్ హోం' రిసెప్షన్ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా రాష్ట్రపతి కార్యాలయం నుంచి విద్యార్థి ఆకర్షణకు ఆహ్వానం రావడంతో అందులో పాల్గొన్నారు. ఇది చెప్పుకోదగ్గ విశేషం. ◻

ఆసియా బాలికల సింగిల్స్ ఛాంపియన్ భారత్ షట్లర్ తన్వీ

న్యూఢిల్లీ: భారత్ టీనేజ్ షట్లర్ తన్వి పత్రి ఆసియా అండర్-15 బ్యాడ్మింటన్ బాలికల సింగిల్స్ ఛాంపియన్‌షిప్‌గా అవతరించింది. చైనాలోని చెంగ్డూ నగరంలో ఆసియా బాడ్మింటన్ బాలిక సింగిల్స్ టోర్నీ చివరి రోజు ఆద్యాంతం నిలకడగా ఆడిన ఒడిశాకు చెందిన 13 ఏళ్ల తన్వీ వరుస గేముల్లో గెలిచింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన తన్వి తుది పోరులో 22-20, 21-22తో రెండో సీడ్ వియత్నాంకు చెందిన ధిధు ముయోన్ ఎన్గు యెన్‌పై విజయం సాధించింది. టైటిల్ గెలిచిన క్రమంలో తన్వీ టోర్నీ మొత్తంలో తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ గెలుపుతో ఆసియా అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించిన మూడో భారత్ క్రీడాకారిణిగా తన్వి గుర్తింపు పొందింది. ఇక ఇదే టోర్నీలో బాలుర అండర్-17 సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్‌కు చెందిన ప్లేయర్ జ్ఞాన దత్తు సెమీ ఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాన్ని సాధించాడు.

సూపర్ ఓవర్‌లో నైట్ రైడర్స్ విజయం

న్యూఢిల్లీ: మహిళల కరేబియన్ ప్రీమియర్ లీగ్‌లో గయానా అమెజాన్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి ఇరు జట్లు 128 పరుగులకు పరిమితం కాగా, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నైట్ రైడర్స్ వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేయగా, ఛేదనలో చేతులెత్తేసిన అమెజాన్ వారియర్స్ 6 బంతుల్లో 2 వికెట్లు కోల్పోయి 5 పరుగులకు మాత్రమే పరిమితమైంది. ఫలితంగా నైట్ రైడర్స్ విజయబావుటా ఎగుర వేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. 129 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వారియర్స్ ఆది నుండి నిదానంగా ఆడటంతో విజయం సాధించ లేకపోయింది.

టీమిండియాలో బ్యాడ్‌లక్ ప్లేయర్లు

తొలి వన్డేనే వీరికి చివరి మ్యాచ్

ఒకే మ్యాచ్‌తో కెరీర్ ముగిసిన దిగ్గజ ఆటగాళ్లు

న్యూఢిల్లీ: భారత్ దేశం తరపున వన్ డే ఇంటర్నేషనల్ ఆడే అవకాశం పొందిన నలుగురు దిగ్గజ టీమిండియా క్రికెటర్లుకు అదే వారి చివరి మ్యాచ్ అయింది. కేవలం ఒక మ్యాచ్ ఆడిన తర్వాత వన్డే కెరీర్ ముగిసిన నలుగురు భారత్ క్రికెటర్లు ఉన్నారు. మళ్లీ వారిని గుర్చి సెలక్టర్లు పట్టించులో లేదు. అటువంటి వారిలో తెలుసుకుంటే జమ్మూ కశ్మీర్‌కు చెందిన 30 ఏళ్ల పర్వేజ్ రసూల్ ఆల్ రౌండర్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. పర్వేజ్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ కాకుండా ఆఫ్ బ్రేక్ బౌలర్ కూడా కావడం విశేషం. 2014 ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో పర్వేజ్‌ను సన్ రైజర్స్ హైదరాబాద్ 95 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. ఐపిఎల్ ఆడే అవకాశం పొందిన కాశ్మీర్‌కు చెందిన తొలి క్రికెట్‌గా అతడు రికార్డుకెక్కాడు. 2014 జూన్ 15న మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన భారత్ క్రికెట్ జట్టు కోసం తన వన్డే అంతర్జాతీయ (ఒడిఐ) అరంగేట్రం చేశాడు. అయితే అతని మొదటి ఒడిఐ మ్యాచే అతనికి చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. ఈ మ్యాచ్‌లో పర్వేజ్ రసూల్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ బౌలింగ్‌లో 2 వికెట్లు పడగొట్టాడు. ఇక పంకజ్ సింగ్ 2010 జూన్ 5న శ్రీలంకతో తన కెరీర్‌లో మొదటి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అయితే ఆ మొదటిమ్యాచ్ అతని చివరిమ్యాచ్‌గా మిగిలిపోయింది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంకజ్ ఫాస్ట్ బౌలర్ కావడం విశేషం. శ్రీలంకపై పంకజ్ సింగ్ 42 బంతుల్లో 45 పరుగులు ఇచ్చాడు. కానీ ఒక్క వికెట్ కూడా తీయలేదు. అలాగే మహారాష్ట్రకు చెందిన ఫైజ్ ఫజల్ ఎడమ చేతివాటం కలిగిన బ్యాట్స్‌మెన్. గతంలో సెంట్రల్ జోన్, ఇండియా రెడ్, ఇండియా అండర్-19, రైల్వేస్, రాజ స్థాన్ రాయల్స్ తరపున ఆడాడు. 2015-16 దేవధర్ ట్రోఫీలో, ఫైజ్ ఫజల్ ఇండియా బితో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఏ తరపున 112 బంతుల్లో 100 పరుగులు చేశాడు. 2015-16 ఇరానీ కప్‌లో ముంబైకి వ్యతిరేకంగా 480 పరుగుల విజయవంతమైన పరుగులో రెస్ట్ ఆఫ్ ఇండియా తరపున ఫజల్ 127 పరుగులు చేశాడు. అతని 2018-19 దులీప్ ట్రోఫీకి ఇండియా బ్లూ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఫౌజల్ 2016లో జింబాబ్వేతో తన మొదటి ఒన్డే ఇంటన్నేషనల్ మ్యాచ్ ఆడాడు. ఇందులో అతను 61 బంతుల్లో 90.16 స్ట్రైక్ రేట్‌తో 55 పరుగులు చేశాడు. కానీ ఇది తన మొదటి ఒన్డే అంతర్జాతీయ మ్యాచ్ మాత్రమే కాకుండా చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. కాగా బిఎస్ చంద్రశేఖర్ 16 ఏళ్ల కెరీర్‌లో 59 టెస్టు మ్యాచ్‌లు ఆడి 29.74 సగటుతో 242 వికెట్లు తీశాడు. తన మొత్తం టెస్టు, ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో సాధించిన పరుగుల కంటే ఎక్కువ వికెట్లు తీసిన ప్రపంచంలోని ఏకైక క్రికెటర్ చంద్రశేఖర్. 1972లో పద్మశ్రీ అవార్డు కూడా వరించింది. 1972లో విస్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యాడు.

ఇక చంద్రశేఖర్ 1976లో న్యూజిలాండ్‌తో ఆడాడు. అందులో అతను బౌలింగ్‌లో 12 సగటుతో 36 పరుగులకు 3 వికెట్లు తీసుకున్నాడు. అతను బ్యాటింగ్‌లో 12 బంతుల్లో 11 పరుగులు చేశాడు.

టి20 సిరీస్ విండీస్ కైవసం

వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిన దక్షిణాఫ్రికా

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో వరుసగా జరిగిన రెండో మ్యాచ్‌లో విండీస్ విజయం సాధించి టి20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. టరౌబా వేదికగా సోమవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టి20లో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ 41 పరుగులు, రోవ్‌మన్ పావెల్ 35 పరుగులు, రూథర్‌ఫోర్డ్ 29 పరుగులు, అలిక్ అధనాజ్ 28 పరుగులతో ఒక మోస్తరు స్కోర్లు చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా విండీస్ పేసర్లు రొమారియో షెపర్డ్ (4-0-15-3). షమార్ జోసఫ్ (4-0-31-3), అకీల్ హోసేన్ (4-0-25-2), మాథ్యూ ఫోర్డ్ (2.4-0-25-1) ధాటికి 19.4 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌట్ అయింది.

ఇక దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో రీజా హెండ్రిక్స్ 44 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 28 పరుగులు, ఎయిడెన్ మార్క్రమ్ 19 పరుగులు, ర్యాన్ రికెల్టన్ 20 పరుగులు, రస్సీ వాన్ డర్ డస్సెన్ 17 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ గెలుపుతో వెస్టిండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. పూరన్ మెరుపులతో విండీస్ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. నామ మాత్రపు మూడో టి20 ఈ నెల 27న టరౌబా వేదికగా జరగనుంది. కాగా టి20 సిరీస్‌కు ముందు వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌లు జరగ్గా, ఈ సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-0 తేడాతో కైవసం చేసుకుంది.

టి20 వరల్డ్ కప్‌కు ఆస్ట్రేలియా టీమ్ రెడీ

న్యూఢిల్లీ: ఈ సారి మహిళల ప్రపంచ కప్ టోర్నీ కోసం ఆసిస్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. సీనియర్లు అంతా జట్టుకు అందుబాటులోకి వచ్చారు. ఈ నేపథ్యంలో మహిళల టి20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా టీమ్ సిద్ధమైంది. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ వేదికగా ఈ ఏడాది అక్టోబరులో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా ఈ సారి కూడా టైటిల్ సాధించి వరుసగా నాలుగు టి20 వరల్డ్ కప్‌లు సాధించిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు అనుగుణంగా 15 మంది సభ్యులతో ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు కెప్టెన్‌గా అలైసా హీలీ ఎంపిక కాగా, వైస్ కెప్టెన్‌గా తహిల మెక్‌గ్రాత్ వ్యవహరించనుంది. సీనియర్ స్పిన్నర్ జెస్ జోనాస్సెన్‌ను పక్కన పెట్టిన ఆస్ట్రేలియా క్రికెట్ సెలక్టర్లు పేజ్ బౌలర్ తైలా వ్లేమింక్‌కు చోటు కల్పించారు. ఆస్ట్రేలియా మహిళల జట్టులో అలైసా హీలీ (కెప్టెన్), డార్సి బ్రౌన్, యాష్ గార్డనర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, అలానా కింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, తహిళ మెక్‌గ్రాత్ (వైస్ కెప్టెన్), సోఫీ మోలినెక్స్, బెత్ మూనీ, ఎల్లిస్ పెర్రీ, మెగాన్ షట్, అన్నాబెల్ సదర్‌ల్యాండ్, జార్జియా వేర్హామ్, తైలా ప్లేమింక్ ఉన్నారు. కాగా టీ 20 వరల్డ్ కప్ ఈ ఏడాది అక్టోబరు 3వ తేదీ నుండి 20వ తేదీ వరకూ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు రెండు గ్రూపులుగా విభజించబడి పోటీ పడతాయి. గ్రూప్-ఎలో భారత్, ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్తాన్ ఉండగా, గ్రూప్ బిలో వెస్టిండీస్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, స్కాట్లాండ్ జట్లు పోటీపడనున్నాయి.

ఫాతిమా కెప్టెన్‌గా పాక్ ప్రపంచ కప్ మహిళా టీమ్

న్యూఢిల్లీ: త్వరలో ప్రారంభమయ్యే మహిళల టి20 వరల్డ్ కప్ టోర్నీకి ఇప్పటికే వివిధ దేశాల జట్లు తమ టీమ్‌లను ప్రకటిస్తున్నాయి. ఇందులో భాగంగా నెల రోజులు ముందుగానే పాకిస్థాన్ తన జట్టును తాజాగా ప్రకటించింది. ఆల్ రౌండర్ ఫాతిమా సనా నాయకత్వంలో 15 మంది సభ్యులతో కూడిన పటిష్టమైన జట్టును ఈ మెగా టోర్నీకి ఎంపిక చేసింది. ప్రస్తుత పాక్ మహిళా జట్టు కెప్టెన్‌గా ఉన్న నిదా దార్‌ను పాక్ క్రికెట్ బోర్డు పక్కన పెట్టింది. ఈ కొత్త జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అలియా రియాజ్, డయానా బేగ్, గుల్ ఫిరోజా, ఇరామ్ జావేద్, మునీబా అలీ (వికెట్ కీపర్), నష్రా సంధు, నిదా దార్, ఒమైమా సోహైల్, సదాఫ్ షమాస్, సాదియా ఇక్బాల్, సిద్రా అమీన్, సయ్యదా అరూబ్ షా, తస్మియా రుబాబ్, తుబా హసన్ ఉన్నారు. కాగా ప్రస్తుతం పాక్ మహిళా జట్టుకు కెప్టెన్‌గా నిదా దార్ వ్యవహరిస్తోంది. ఆల్ రౌండర్ అయిన నిదా ఆఫ్ స్పిన్నర్‌గా గుర్తింపు ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ జట్టులో కీలకం కానున్న తరుణంలో టి20 ప్రపంచ కప్‌కు పోటీ పడే జట్టులో ఈమెను తప్పించడం పాక్‌కు పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన పొట్టి ఫార్మాట్‌లో జట్టును విజయపథంలో నడిపించకపోవడే ఆమెపై వేటు పడింది. నిదా దార్ నాయకత్వంలో పాకిస్థాన్ జట్టు 24 టి20లు ఆడగా, కేవలం 9 టి20ల్లోనే విజయం సాధించింది.

ఐపిఒకు 'బజార్ స్టైల్ రిటైల్'!

ముంబై, ఆగస్టు 26: బజార్ స్టైల్ రిటైల్ కంపెనీ ఇప్పటికే తన ఐపిఒకి సంబంధించిన దర ఖాస్తును సెబి వద్ద ఉంచింది. మెయిన్ కేటగిరీలో వస్తున్న ఐపిఒ రూ.834.68 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో కొత్త ఇష్యూ రూ.148 కోట్లు ఉండగా, మిగిలిన మొత్తం ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రమోటర్లు విక్రయించే వాటాల ద్వారా సమీకరించనున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐపిఒ లిస్టింగ్ సెప్టెంబర్ 6న ఎన్ఎస్ఇ, బిఎస్ఇలో ఉంటుందని తెలుస్తోంది. ఈ క్రమంలో బజార్ స్టైల్ రిటైల్ తన ఐపిఒ ప్రైస్ బ్యాండ్ ధరను రూ.370 నుంచి రూ.389గా నిర్ణయించింది. అలాగే పెట్టుబడిదారుల కోసం లాట్ పరిమాణాన్ని 38 షేర్లుగా ప్రకటించింది. దీని ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ కొనుగోలు చేసేందుకు రూ.14,782 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంది. రిటైల్ పెట్టుబడిదారుల కోసం ఐపిఒ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు తెరచి ఉండనుంది. కంపెనీ ఐపిఒ ద్వారా సమీకరించిన మొత్తంలో కొంత భాగాన్ని రుణాల చెల్లింపులకు వినియోగించాలని చూస్తోంది. దీనికి తోడు సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కూడా ఈ డబ్బును వినియోగించనుంది. కంపెనీ ఆర్థిక పనితీరును పరిశీలిస్తే 2024లోకంపెనీ మొత్తం ఆదాయం యేడాది ప్రాతిపదికన రూ.794 కోట్ల నుంచి 23శాతం పెరిగి రూ.982 కోట్లుగా నివేదించింది. ఈ క్రమంలో లాభం రూ.21 కోట్లుగా నివేదించబడింది.



యుపిఐ తరహాలో యుఎల్ఐ..

న్యూఢిల్లీ, ఆగస్టు 26: యుపిఐ సేవల ద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మరో కొత్త తరహా సేవలకు నాంది పలక నుంది. రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్ఐ)ను జాతీయ స్థాయిలో త్వరలో లాంచ్‌చేయనుంది. గతేడాదే 'ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్' పేరిట ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ఆర్‌బిఐ అవి సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దేశ వ్యాప్తంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది. 'డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యుపిఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో..రుణ వితరణలో యుఎల్ఐ కూడా అదేపాత్ర పోషించబోతోంది. దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యుఎల్ఐ కీలక భూమిక నిర్వహించబోతోంది' అని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. భూ రికార్డులు మొదలుకొని, ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యుఎల్ఐ పనిచేస్తుందని చెప్పారు. దీనివల్ల రుణ ఆమోద ప్రక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ ప్రక్రియ అవసరం ఉండదని శక్తికాంతదాస్ వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఇ, వ్యవసాయ రుణాల జారీ వేగవంతం కానుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను లాంచ్ చేశారు. ఆర్‌బిఐకి చెందిన రిజర్వ్ బ్యాంకు ఇన్నోవేషన్ హబ్ ద్వారా దీన్ని చేపట్టారు.

విజయ్ శేఖర్ శర్మకు సెబి నోటీసులు!

ముంబై, ఆగస్టు 26: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ పేటిఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్లు సోమవారం భారీగా కుంగాయి. కంపెనీ వ్యవస్థాపకుడు శేఖర్ శర్మకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు వార్తలు రావడమే ఇందుకు కారణం. దీంతో సోమవారం పేటిఎం షేర్లు ఓ దశలో బిఎస్ఇలో 8.88 శాతం క్షీణించి 505.25కు చేరడం విశేషం. తర్వాత కాస్త కోలుకున్నాయి. 2021 పేటిఎం ఐపిఒకు వచ్చిన విషయం విదితమే. పబ్లిక్ ఇష్యూకు సంబంధించి ప్రమోటర్ క్లాసిఫికేషన్ నిబంధనలు పాటించలేదంటూ ఆర్‌బిఐఇచ్చిన ఇన్‌పుట్స్ మేరకు సెబి, విజయ్ శేఖర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు సంబంధిత వర్గాలను ఒక కథనం వెలువడింది. అంతేకాకుండా మాజీ బోర్డు మెంబర్లకు కూడా ఈ నోటీసులు జారీ అయినట్లు తెలిసింది. ఈయేడాది పేటిఎంపేమెంట్స్ బ్యాంకుపై చర్యలు తీసుకున్న విషయం విదితమే. 2021లో పేటిఎం ఇష్యూ ధర రూ.2150 కాగా, 9శాతం డిస్కౌంట్‌తో రూ.1995 వద్ద షేర్లు లిస్టయ్యాయి. దీంతో ఆరంభంలోనే నిరాశపరిచింది. ఇన్వెస్టర్లకు నష్టాలను మిగిల్చింది. తర్వాత ఏనాడూ ఆ స్థాయికి చేరింది లేదు. పైగా పేటిఎం పేమెంట్స్ బ్యాంకుపై ఆర్‌బిఐచర్యల నేపథ్యంలో ఈ యేడాది షేరు ధర రూ.310 వద్ద కనిష్టానికి చేరింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వేళ తాజా షాక్ తగిలింది.

సెబి బ్యాన్‌పై రంగంలోకి దిగిన 'అనిల్'

ముంబై, ఆగస్టు 26: గతవారం ముందు వరకు వరుసగా పాజిటివ్ వార్తలతో ఒకప్పటి బిలియనీర్ అనిల్ అంబానీ వార్తల్లో నిలిచారు. అయితే ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబి చర్యలతో వార్తల్లో అంబానీ సోదరుడి పేరు మారుమోగుతోంది. ఇన్వెస్టర్లలో పెద్ద గందరగోళానికి దారి తీసిన ఈ వ్యవహారంపై అనిల్ అంబానీ స్పందించారు. సెబి విధించిన జరిమానా, నిషేధంపై ముందుకు వెళ్లేందుకు తగిన లీగల్ ఆప్షన్ పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి గతంలో రిలయన్స్ కేపిటల్ సబ్సిడరీ సంస్థగా ఉన్న రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీలో భారీగా నిధుల మళ్లింపు రుణాల మాటున జరిగిందని గుర్తించిన సెబి అనిల్ అంబానీతో పాటు అనేక మంది గత కంపెనీ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారంలో మొత్తం అంబానీతో పాటు మరో 24 మందిపై రూ.624 కోట్లు ఫైన్ వేసింది. అలాగే ఫిబ్రవరి 11, 2022 నాటి సెబి మధ్యంతర ఉత్తర్వుకు అనుగుణంగా రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ బోర్డులకు రాజీనామా చేసినట్లు అంబానీ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే సెబి ఆగస్టు 22 నాటి తుది ఉత్తర్వును అనిల్ అంబానీ సమీక్షిస్తున్నారని, న్యాయ పరంగా సలహా మేరకు తగిన చర్యలు తీసుకుంటారని ప్రతినిధి వెల్లడించారు. ఇదే వ్యవహారంపై రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పందిస్తూ సెబి కంపెనీకి వ్యతిరేకంగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఫిబ్రవరి11, 2022నాటి మధ్యంతర ఉత్తర్వు ప్రకారం రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ల బోర్డు నుంచి అనిల్ అంబానీ ఇప్పటికే రాజీనామా చేశారని స్పష్టం చేసింది. ఇదే తరహాలో రిలయన్స్ పవర్ కూడా ఒక ప్రకటన విడుదల చేస్తూ కంపెనీపై సెబి చర్యల ప్రభావం లేదని వెల్లడించింది. అయితే సెబి చర్యలు అనిల్ అంబానీ లిస్టెడ్ కంపెనీల్లో కొంతఅలజడిని సృష్టించాయి. భయాందోళనకు గురైన పెట్టుబడిదారులు వాటాల విక్రయానికి కూడా దిగారు. మొత్తానికి అనిల్ అంబానీ చాలా కాలం తర్వాత తిరిగి బౌన్స్ బ్యాక్ అవుతున్న సమయంలో సెబి చర్యలు మళ్లీ కష్టాలను తెచ్చిపెడుతున్నాయి.

ఫోర్కాస్ స్టూడియో లిస్టింగ్ అదుర్స్

ముంబై, ఆగస్టు 26: ఫోర్కాస్ స్టూడియో కంపెనీ ఐపిఒ మార్కెట్‌లో బలమైన లిస్టింగ్‌ను నమోదు చేశాయి. ఈ క్రమంలో లిస్టింగ్ రోజున ఇష్యూ ధరతో పోలిస్తే షేర్ల ధర రెండింతలు కావడంతో పెట్టుబడిదారులు మొదటి రోజే తమ పెట్టుబడి సొమ్మును రెట్టింపు చేసుకున్నారు. అలాగే లిస్టింగ్ తర్వాత సైతం మార్కెట్లో కంపెనీ షేర్ల కొనుగోలుకు డిమాండ్ భారీగా కనిపించింది. ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ కేటగిరీలో వచ్చిన ఫోర్కాస్ స్టూడియో స్టాక్ మార్కెట్లో అద్భుతమైన లిస్టింగ్ ద్వారా పెట్టుబడిదారులను ధనవంతులుగా మార్చేసింది. వాస్తవానికి కంపెనీ ఇష్యూ సమయంలో ఒక్కో షేరుకు అప్పర్ ప్రైస్ బ్యాండ్ ధరను రూ.80 వద్ద విక్రయించగా, సోమవారం మార్కెట్లో 90శాతం ప్రీమియం ధర వద్ద ఒక్కో షేరు రూ.152 రేటుకు మార్కెట్లో జాబితా అయ్యాయి. అలాగే అద్భుతమైన లిస్టింగ్ తర్వాత కంపెనీ షేర్లు అప్పర్ సర్క్యూట్‌కి చేరి రూ.159.60కు చేరాయి. ఈ క్రమంలో కంపెనీ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ ధరను కంపెనీ రూ.77-80గా ఉంచింది. ఐపిఒలో పాల్గొనేందుకు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఆగస్టు 19 నుంచి ఆగస్టు 21 వరకు అవకాశం కల్పించబడింది. తాజా ఐపిఒ ద్వారా కంపెనీ మార్కెట్ల నుంచి రూ.37.44 కోట్లను విజయవంతంగా సమీకరించింది. ఇందుకోసం 46.80 లక్షల షేర్లను జారీచేసింది.

వాణిజ్యం

స్టాక్ సూచీలకు 'ఫెడ్' జోష్..

ముంబై, ఆగస్టు 26: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిసాయి. అమెరికా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ దూసుకెళ్లాయి. విదేశీ పెట్టుబడులూ కలిసొచ్చాయి. రేట్ల కోతకు సమయం వచ్చిందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లలో జోష్‌కు కారణం. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700కిపైగా పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 25వేల స్థాయి ఎగువన ముగియడం

విశేషం. సెప్టెంబరులో కనీసం 25 బేసిస్ పాయింట్లు మేర రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,388.26 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,824.27 పాయింట్ల వద్ద గరిష్టానికిచేరింది. చివరికి 611.90 పాయింట్లు లాభపడి 81,698.11 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 182.75 పాయింట్లు పెరిగి 25,005 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.83.89గా ఉంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఎన్‌టిపిసి, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్‌మహీంద్రా, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అదానీ పోర్ట్స్, మారుతి సుజుకి, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 79.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా వడ్డీ రేట్ల కోత అంచనాల వేళ పసిడికి డిమాండ్ ఏర్పడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.